

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్

కె.కోటపాడు మండలం సంతపాలెంలో అనుమతి లేకుండా ఎరువుల అమ్మకాలు



కె.సంతపాలెంలో సీజ్ చేసిన నిషేధిత ఎరువులు

- విజిలెన్స్ వ్యవసాయ శాఖల అధికారుల దాడులు
- వివిధ రకాలకు చెందిన 620 బస్తాల నిషేధిత ఎరువులు సీజ్
- వ్యాపారిపై కేసు నమోదు
- జిల్లాలో ఎరువుల షాపులు, గోదాముల్లో విస్తృతంగా తనిఖీలు



కె.కోటపాడు మండలం కె.సంతపాలెంలో అధికారులు పట్టుకున్న నిషేధిత ఎరువులు

అనకాపల్లి/కె.కోటపాడు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):

రసాయన ఎరువులను బ్లాక్ చేసి, తెరచాటున ఎక్కువ ధరకు అమ్ముతున్నట్టు అందిన ఫిర్యాదులపై జిల్లా అధికారులు స్పందించారు. జిల్లాలో ఎరువులు, క్రిమిసంహారక మందుల విక్రయ దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయ శాఖల అధికారులు దాడులు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. లైసెన్స్ లేకుండా ఎరువులు విక్రయించడంతోపాటు నిషేధిత ఎరువులు అమ్ముతున్నట్టు గుర్తించారు. ఎరువులను సీజ్ చేసి, దుకాణదారులపై కేసులు నమోదు చేస్తున్నారు.

జిల్లాలో కొద్ది రోజుల నుంచి సమృద్ధిగా వర్షాలు కురుస్తుండడంతో పొలాల్లో దమ్ము పనులు, వరినాట్లు ఊపందుకున్నాయి. ఈ సమయంలో రైతులు తప్పకుండా రసాయన ఎరువులు వినియోగిస్తారు. దాదాపు 80 శాతం మంది రైతులు ప్రస్తుతం వరినాట్లు వేస్తుండడంతో రసాయన ఎరువులకు గిరాకీ ఏర్పడింది. ఇదే అదనుగా భావించిన పలువురు వ్యాపారులు కృత్రిమంగా ఎరువుల కొరతను సృష్టించి, బ్లాకులో ఎక్కువ రేటుకు అమ్ముతున్నారు. మరికొంతమంది వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి ఇన్‌వాయిస్‌లు లేకుండా, నిషేధ ఎరువులను తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. వీటిపై రైతుల నుంచి ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వం స్పందించింది. కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ ... మిగతా 8వ పేజీలో

ఎరువుల వ్యాపారుల దోపిడీ

- ఘాట్‌రోడ్ జంక్షన్‌లోని దుకాణాల్లో అధిక రేటుకు యూరియా విక్రయం
- బస్తా ధర రూ.266.5
- కానీ రూ.350-380 వసూలు చేస్తున్న వ్యాపారులు
- పట్టించుకోని అధికారులు



యూరియాను అధిక ధరకు కొనుగోలు చేసి తీసుకెళుతున్న ఒమ్మలి రైతు

మాడుగుల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో వున్న రెండు ఎరువుల దుకాణాల్లో అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నట్టు రైతులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు కాకుండా, వ్యాపారులు ఎక్కువ రేటుకు ఎరువులు అమ్ముతూ రైతులను నిలువునా దోచేస్తున్నారు. వ్యవసాయ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూరియా బస్తా రైతు సేవా కేంద్రాల్లో రూ.266.50కి విక్రయిస్తున్నారు. ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో కూడా ఇదే ధరకు అమ్మాలి. కానీ సోమవారం ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో వున్న రెండు ఎరువుల దుకాణాల నిర్వాహకులు యూరియా బస్తాకు రూ.350 నుంచి రూ.380 వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం పొలాలను దమ్ము పట్టి, వరినాట్లు వేస్తుండడంతో ఎరువుల అవసరం ఏర్పడింది. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు, ఎరువులను దాచిపెట్టి, స్టాక్ లేదంటూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. కొంచెం ఎక్కువ ధర అయినా చెల్లిస్తాం.. ఎరువు కావాలని రైతులు బతిమాలుతుండడాన్ని వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. వేరే రైతులు ఎరువులు కొనుగోలు చేసి ఇంకా ... మిగతా 8వ పేజీలో

28న డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

వేదిక...ఉక్కు నగరంలోని విశాఖ విమల విద్యాలయం

- 1,139 పోస్టుల భర్తీకి అభ్యర్థుల ఎంపిక
- నేటి సాయంత్రంలోగా కాల్ లెటర్స్



విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):

డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 28వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు ఉక్కునగరంలోని విమల విద్యాలయంలో ప్రారంభం కానున్నది. ఇందుకోసం విమల విద్యాలయంలో 21 కౌంటర్లు ఏర్పాటుచేశారు. ప్రతి కౌంటర్‌లో ఎంఈవో, హెచ్ఎం, డిప్యూటీ తహశీల్దారుతో కూడిన బృందం ఉంటుంది. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సోమవారం రాత్రి నుంచి కాల్‌లెటర్లు పంపించే ప్రక్రియ మొదలవుతుందని, మంగళవారం సాయంత్రంలోగా పూర్తవుతుందని విద్యా శాఖ వర్గాలు తెలిపాయి. కాల్‌లెటర్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని పేర్కొన్నాయి.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో వివిధ కేటగిలలో 1,139 పోస్టుల భర్తీకి అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. ప్రతి కేటగిరీలో ఏ ర్యాంకు వరకూ ఉద్యోగం వస్తోందనేది అభ్యర్థులకు మాత్రమే తెలిసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జోన్-1లోని రెసిడెన్షియల్ స్కూళ్లు, మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు, పీజీటీ, టీజీటీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఇదే ప్రాంగణంలో నిర్వహిస్తారు. అభ్యర్థులు తమ విద్యార్హతలకు చెందిన ఒరిజినల్ ధ్రువపత్రాలు, ఇటీవల జారీచేసిన కుల ధ్రువీకరణ పత్రం (అవసరమైన వర్గాలకు), అంగవైకల్యం ఉంటే సంబంధిత సర్టిఫికెట్, కాల్ లెటర్‌లో పేర్కొన్న ఇతర ధ్రువీకరణ పత్రాలు, గజిటెడ్ అధికారి ధ్రువీకరించిన మూడుసెట్ల జెరాక్స్ కాపీలు, ఐదు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకువెళ్లాల్సి ఉంటుంది. కాగా ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు విస్తృత ఏర్పాట్లుచేశామని విద్యా శాఖ ఆర్జేడీ విజయభాస్కర్ తెలిపారు. ఆయా కేంద్రాల్లో తాగునీరు, వైద్య సదుపాయం ఏర్పాటుచేశామన్నారు.



ఎన్టీఆర్ స్టేడియంలో ముస్తాబవుతున్న 126 అడుగుల భారీ లక్ష్మీగణపతి విగ్రహం

అనకాపల్లిలో భారీ గణనాథుడు

ఎన్టీఆర్ స్టేడియంలో 126 అడుగుల ఎత్తున లక్ష్మీగణపతి విగ్రహం

- తుది దశకు చేరుకున్న తయారీ పనులు
- రూ.70 లక్షలు ఖర్చు చేస్తున్నట్టు ఉత్సవ కమిటీ వెల్లడి
- వచ్చే నెల 23వ తేదీ వరకు చవితి ఉత్సవాలు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):

వినాయక చవితి వేడుకల సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో భారీ లక్ష్మీగణపతి విగ్రహం ముస్తాబవుతున్నది. గతంలో ఎన్నడూ లేని విధంగా 126 అడుగుల వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. సంపత్ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ వినాయక విగ్రహానికి ప్రముఖ శిల్పి కామధేను ప్రసాద్ తుది మెరుగులు దిద్దుతున్నారు. మంగళవారం రాత్రికి విగ్రహం తయారీతోపాటు మండపం ఏర్పాటు పనులు పూర్తవుతాయని నిర్వాహకులు చెబుతున్నారు. భారీ వినాయక విగ్రహం తయారీ కోసం నాలుగు టన్నుల మట్టి, మండలం ఏర్పాటు కోసం తొంబై టన్నుల సరుగుడు బాదులు వాడుతున్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి వచ్చే నెల 23వ తేదీ.. నాలుగు వారాలపాటు చవితి ఉత్సవాలను నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. జిల్లాలోనే కాదు.. రాష్ట్రంలోనే 126 అడుగుల భారీ వినాయక విగ్రహాన్ని నెలకొల్పిన రికార్డు అనకాపల్లికే దక్కుతుందని ... మిగతా 8వ పేజీలో

బార్ల ఏర్పాటుకు అరకొర స్పందన

- జిల్లాలో మూడు బార్లకు ఐదు దరఖాస్తులు
- ఒక్కోదానికి కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే డ్రా తీయాలని నిబంధన
- నేటితో ముగియనున్న గడువు

అనకాపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెస్టారెంట్ అండ్ బార్ల ఏర్పాటుకు వ్యాపారుల నుంచి అంతంతమాత్రంగానే స్పందన వస్తున్నది. జిల్లా పొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరిధిలోని నర్సీపట్నంలో ఒకటి, ఎలమంచిలి రెండు.. మొత్తం మూడు బార్ల ఏర్పాటుకు అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఒక్కో బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు వస్తే.. ఈ నెల 28న కలెక్టర్ సమక్షంలో డ్రా తీసి బార్‌లను కేటాయించాలని అధికారులు నిర్ణయించారు. దరఖాస్తుల స్వీకరణకు మంగళవారంతో గడువు ముగియనుండగా.. సోమవారం సాయంత్రానికి ఐదు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఎలమంచిలిలో ఒక బార్‌కు రెండు దరఖాస్తులు, నర్సీపట్నంలో రెండు బార్‌లకు మూడు దరఖాస్తులు అందాయి. మద్యం దుకాణాలకు అనుబంధంగా పర్మిట్ రూమ్‌ల నిర్వహణకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడంతో బార్ల ఏర్పాటుకు మద్యం వ్యాపారులు ఆసక్తి చూపడం లేదని తెలిసింది. మంగళవారం సాయంత్రంతో గడువు ముగియనుండడంతో ఒక్కొక్క బార్‌కు నాలుగు దరఖాస్తుల చొప్పున మొత్తం 12 దరఖాస్తులు అందుతాయని అధికారులు భావిస్తున్నారు.

పర్మిట్ రూమ్‌లకు అనుమతులు

జిల్లాలో 158 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటికి అనుబంధంగా పర్మిట్ రూమ్‌లను ఏర్పాటు చేసుకొనేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. పర్మిట్ రూమ్ ఏర్పాటు చేయాలంటే ఏడాదికి రూ.5 లక్షల చొప్పున ఎక్సైజ్ శాఖకు చెల్లించాలని నిబంధన విధించింది. జిల్లాలో ఇప్పటి వరకు 130 మద్యం దుకాణాల నిర్వాహకులు పర్మిట్ రూమ్‌ల ఏర్పాటు కోసం రూ.5 లక్షల చొప్పున చెల్లించారు. మిగిలిన మద్యం దుకాణదారులు ఒకటి, రెండు రోజుల్లో డబ్బులు చెల్లిస్తే పర్మిట్ రూమ్‌లకు అనుమతులు జారీ చేస్తారు.

18 రకాల దినుసులతో వినాయక విగ్రహం



వివిధ రకాల దినుసులతో తయారు చేసిన వినాయక విగ్రహం

నర్సీపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక డాన్‌బాస్కో స్కూల్ రోడ్డులో నివాసం ఉంటున్న వానపల్లి వాసు వినాయక చవితి సందర్భంగా 18 రకాలైన దినుసులతో గణపతి విగ్రహ రూపకల్పన చేశారు. ఏటా డ్రైఫ్రూట్స్‌తో వినూత్న రీతిలో వినాయక విగ్రహాలు తయారు చేయడం వాసు ప్రత్యేకత. ఈసారి డ్రై ఫ్రూట్స్ కాకుండా 18 రకాల దినుసులతో ఆకర్షణీయంగా రూపొందించారు. ఇందుకోసం కందులు, ఉలవలు, గుమ్మడి గింజలు, సోయా బీన్స్, శనగ పప్పు, బఠాణీలు, ధనియాలు, శనగలు, సోంపు, బాదం పప్పు, సగ్గుబియ్యం, అనాస పువ్వు, బీన్స్ ఆవాలు, గసగసాలు, సబ్జా గింజలు, దోస పప్పు వాడారు. వివిధ రకాల దినుసులతో వినాయక విగ్రహం తయారీకి 15 రోజులు పట్టినట్టు వాసు తెలిపారు. ఈ విగ్రహాన్ని శాంతినగర్‌లోని వినాయకచవితి మండపంలో ఉంచి పూజలు చేయనున్నట్టు ఆయన పేర్కొనన్నారు.

ప్రమాదంలో వారధులు

శిథిలావస్థకు చేరిన కట్టడాలతో పొంచిఉన్న ముప్పు

ఇప్పటికే కూలిపోయిన వడ్డాది, విజయరామరాజుపేట, కట్టువాని అగ్రహారం వంతెనలు

- కాజ్‌వేలు నిర్మించి చేతులు దులుపుకుంటున్న అధికారులు
- వరద ఉధృతికి కొట్టుకుపోతున్న కాజ్‌వేలు
- సత్వరమే పునరుద్ధరణ పనులు చేపట్టని దుస్థితి
- రాకపోకలకు రోజుల తరబడి ప్రజల ఇక్కట్లు
- ప్రతిపాదనలకే పరిమితమైన కొత్త వంతెనల నిర్మాణం

చోడవరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):

చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని పలు మార్గాల్లో వున్న ప్రధాన వంతెనలు ఒక్కొక్కటిగా కూలిపోతున్నాయి. వాటి స్థానంలో కొత్త వంతెనలు నిర్మించకుండా, తాత్కాలికంగా కాజ్‌వేలతో సరిపెట్టడం, భారీ వర్షాలకు అవి కొట్టుకుపోతుండడంతో ఆయా మార్గాల్లో రోజుల తరబడి వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో ప్రత్నామ్నాయ మార్గాల్లో చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



ప్రమాదకర స్థితిలో వున్న గోవాడ వంతెన



శిథిలావస్థకు చేరిన జన్నవరం వంతెన



ఇటీవల వర్షాలు, వరదలకు కొట్టుకుపోయిన వడ్డాది కాజ్‌వే

జిల్లాలో ప్రధానమైన శారదా, పెద్దేరు, బొడ్డేరు, తాచేరు వంటి నదులు మాడుగుల, చోడవరం నియోజకవర్గాల మీదుగా వెళుతుంటాయి. వీటిపై పలుచోట్ల ప్రజల రాకపోకల కోసం దశాబ్దాల క్రితం వంతెనలు నిర్మించారు. కాలక్రమేణాల వాహనాల రద్దీ పెరగడంతో వంతెనలు బలహీనంగా మారి, కూలిపోతున్నాయి.. లేదా కుంగిపోతున్నాయి.

బుచ్చెయ్యపేట మండలం వడ్డాది వద్ద పెద్దేరు నదిపై ఎప్పుడో బ్రిటీష్ హయాంలో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరి, 2022 మే 11వ తేదీన కుంగిపోయింది. దీంతో నర్సీపట్నం నుంచి పాడేరు, మాడుగుల, చోడవరం వైపు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్‌ను వేరే మార్గాల్లో మళ్లించారు. అప్పటి వైసీపీ ప్రభుత్వం ఇక్కడ కొత్త వంతెన నిర్మాణం చేపట్టకుండా... పక్కనే తక్కువ ఎత్తులో కాజ్‌వే నిర్మించి చేతులు దులుపుకుంది. పెద్దేరు నదిలో వరద ఉధృతి పెరిగితే.. కాజ్‌వే మీదుగా నీరు ప్రవహించి ఛిద్రం అవుతున్నది. దీనికి బాగు చేసే వరకు ప్రజలకు రవాణా కష్టాలు తప్పడం లేదు.

చోడవరం-పాడేరు మార్గంలో బొడ్డేరు నదిపై విజయరామరాజుపేట వద్ద వున్న వంతెన రెండేళ్ల క్రితం కూలిపోయింది. ఇక్కడ కూడా తాత్కాలికంగా కాజ్‌వే నిర్మించారు. బొడ్డేరు నదిలో వరద ఉధృతి పెరిగితే.. ఇక్కడ కాజ్‌వే కొట్టుకుపోవడం పరిపాటిగా మారింది. గత వారం కురిసిన భారీ వర్షాలకు నదిలో వరద పోటెత్తడంతో కాజ్‌వే ధ్వంసమైంది. చోడవరం వైపు నుంచి మాడుగుల, నర్సీపట్నం, పాడేరు ప్రాంతాలకు రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చీడికాడ, దేవరాపల్లి, మాడుగుల, బుచ్చెయ్యపేట మండలాలకు ప్రధానమైన చీడికాడ మండలం కట్టువాని అగ్రహారం వద్ద బొడ్డేరు నదిపై వున్న మరో వంతెన కూలిపోయింది. చోడవరం మండలం గవరవరం వద్ద శారదా నదిపై వున్న వంతెన పుష్కరకాలం క్రితం కుంగిపోగా, కొత్త వంతెన నిర్మించి, అందుబాటులోకి తీసుకురావడానికి దాదాపు పదేళ్ల ... మిగతా 8వ పేజీలో

ఏయూ రిజిస్ట్రార్ రాజీనామా!

- బాధ్యతల నుంచి తప్పుకున్న ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు
- క్యాంపస్‌లో కలకలం
- వీసీతో దూరం పెరగడమే కారణం



ప్రొఫెసర్ ధనుంజయరావు

విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు రాజీనామా చేశారు. తనను బాధ్యతల రిలీవ్ చేయాలని ఆయన సోమవారం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్‌ను కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ప్రొఫెసర్ ధనుంజయరావు రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. అయితే, అనూహ్యంగా ఇప్పుడు తప్పుకోవడం చర్చనీయాంశంగా మారింది. రిజిస్ట్రార్‌గా ఏడాదిపాటు అందించిన సేవలు తనకు సంతృప్తిని కలిగించాయని, ఈ అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, ఏయూకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు ఆయన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. రిజిస్ట్రార్ నిర్ణయం వర్సిటీలో కలకలం రేపింది. అందుకు గల కారణాలు ఏమై ఉంటాయా.? అన్న చర్చ జరుగుతోంది. అయితే, ఈ నిర్ణయం వెనుక బలమైన కారణాలు ఉన్నట్టు చెబుతున్నారు. గడిచిన కొన్నాళ్లుగా వీసీ, రిజిస్ట్రార్ మధ్య దూరం పెరిగిందని పలువురు పేర్కొంటున్నారు. ప్రధానంగా కొన్ని కీలక నిర్ణయాల్లో రిజిస్ట్రార్‌కు వీసీ భాగస్వామ్యం కల్పించడం లేదని చెబుతున్నారు. కొన్నాళ్ల కిందట డీన్లు, డైరెక్టర్లు, ఇతర పదవుల నియామకాన్ని వీసీ చేపట్టారు. అయితే, వారిని నియమించే క్రమంలో కనీసం రిజిస్ట్రార్‌గా ఉన్న ధనుంజయరావును వీసీ సంప్రతించలేదని ... మిగతా 8వ పేజీలో

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ వాయిదా

- వచ్చే ఆరో తేదీ నుంచి అందజేత
- జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి మూర్తి వెల్లడి

అనకాపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్మార్ట్ రేష్ కార్డులను వచ్చే నెల ఆరో తేదీ నుంచి పంపిణీ చేయనున్నట్టు జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి కేఎల్ఎన్ మూర్తి తెలిపారు. సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ, జిల్లాలో ప్రస్తుతం ఉన్న 5.3 లక్షల పాత కార్డులతోపాటు కొత్తగా రేషన్ కార్డులు మంజూరైన వారికి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తామన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం జిల్లాలో 12,759 మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో అర్హత కలిగిన 9,369 మందికి కొత్తగా స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వనున్నట్టు చెప్పారు. వాస్తవానికి ఈ నెల 25వ తేదీ నుంచి కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయాల్సి వుందని, అయితే సెప్టెంబరు 6వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని మండలాల్లో పంపిణీ చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయని పేర్కొన్నారు. కాగా కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియగా సాగుతుందన్నారు.

ఒడ్డిమెట్టలో నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు


స్వయంభూ వినాయకుడు

నక్కపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒడ్డిమెట్ట లక్ష్మీగణపతి ఆలయంలో వినాయ చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవవరం శివారు ఒడ్డిమెట్ట కొండపై స్వయం వ్యక్తమైన వినాయకుడిని 130 ఏళ్ల క్రితం ఆలయంలో ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. దేవదాయ,ధర్మాదాయ శాఖ పరిధిలో ఒడ్డిమెట్ట వినాయకుడి ఆలయం వుంది. వినాయక చవితి రోజున అనేక ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు ఈ ఆలయానికి వస్తారు. ఆలయ ప్రాంగణంలో క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా 9 రోజుల పాటు ప్రత్యేక పూజలు జరుగుతాయి.

రక్తదాతలు ప్రాణ ప్రదాతలు : ప్రగడ


రక్తదాన శిబిరంలో పాల్గొన్న ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రక్తదాతలు ప్రాణ ప్రదాతలని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. విశ్వ బంధుత్వ దినోత్సవం సందర్భంగా బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అచ్యుతాపురంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో ఆయన మాట్లాడారు. రక్తదానం చేయడం వల్ల ప్రాణాపాయంలో ఉన్న ఎంతోమందిని కాపాడవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దూళి రంగనాయకులు, వడిసెల ఈశ్వరరావు, రామినేని చౌదరి, కాసుబాబు, శాంతి, శృతి, పూర్ణిమ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసిన ఉపాధ్యాయులు

ఎలమంచిలి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేట బయ్యవరం ప్రాథమిక స్కూలు విద్యార్థులకు దాతల ఆర్థిక సాయంతో స్టడీ మెటీరియల్‌ను ఉపాధ్యాయులు సోమవారం పంపిణీ చేశారు. ఎలమంచిలికి చెందిన స్వర్గీయ కట్టా అబ్బాయి శెట్టి కుమారుడు మూర్తి, బయ్యవరానికి చెందిన ఎద్దు చిట్టిబాబులు రూ.8 వేల విలువ చేసే స్టడీ మెటీరియల్‌ను దాతలు అందజేశారు. ఈ మెటీరియల్‌ను సోమవారం గ్రామ సర్పంచ్ ఎం. సత్యనారాయణ విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం. ధనలక్ష్మి, ఉపాధ్యాయులు బొడ్డేడ సత్యనారాయణ, నీరజ, వీరభద్రరావు, శోభారాణి, కన్యాకుమారి పాల్గొన్నారు.

'ఆలయాల అభివృద్ధిలో దాతల సహకారం అవసరం'

నక్కపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆలయాలను అభివృద్ధి చేయడంలో దాతల భాగస్వామ్యం ఎంతో అవసరమని, ఆలయాల్లో నిరంతరం పూజలు జరగడం వల్ల ఆయా ప్రాంతాలు సుభిక్షంగా వుంటాయని రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ అన్నారు. మండలంలోని ఒడ్డిమెట్ట వినాయక ఆలయంలో దాతల సహకారంతో నిర్మించిన నూతన మెట్ల మార్గాన్ని వీసం రామకృష్ణ సోమవారం సాయంత్రం ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ గొర్ల రాఘవకుమారి, నర్సింహమూర్తి, వైసీపీ నాయకులు వేగేశ్న చంటిరాజు, వేగేశ్న రామకృష్ణరాజు, పైల నూకన్ననాయుడు, సకిరెడ్డి వెంకట రమణ తదితరులు ఈ మెట్లను నిర్మించడం పట్ల వీసం రామకృష్ణ అభినందించారు. గతంలో స్థానిక ప్రముఖులు గెడ్డం బుజ్జి, తోట నగేశ్ ఆధ్వర్యంలో ఒడ్డిమెట్ట వినాయక ఆలయంలో అనేక అభివృద్ధి పనులు జరగడంతో చాలా మంది దాతలు స్పందిస్తున్నారని చెప్పారు.

మట్టి గణపతులను పూజించాలంటూ ర్యాలీ



మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న దృశ్యం

నక్కపల్లి,ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు హైస్కూల్‌లో రవీంద్రనాథ్ ఠాగూర్ ఆంగ్ల క్లబ్ వ్యవస్థాపకుడు వై.వెంకట రమణ ఆధ్వర్యంలో మట్టి గణపయ్యలను పూజించాలంటూ అవగాహన కల్పించారు. హెచ్‌ఎం వి.బాలాజీ, ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి గ్రామ వీధుల్లో మట్టి గణపయ్యలను పట్టుకుని అవగాహనా ర్యాలీ చేశారు. పర్యావరణాన్ని కాపాడుకుందాం.. రంగులు వద్దు, ప్రకృతే ముద్దు అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఉపాధ్యాయులతోపాటు, గ్రామస్థులకు,విద్యార్థులకు మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాంబశివరావు, ప్రసాద్, సునీత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

నవోదయ స్టడీ మెటీరియల్ పంపిణీ


విద్యార్థులకు నవోదయ స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

పాయకరావుపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్.వాడ ఎంపీపీ మోడల్ స్కూల్ 5వ తరగతి విద్యార్థులకు నవోదయ స్టడీ మెటీరియల్‌ను దాతలు అందజేశారు. సోమవారం పాఠశాలలో హెచ్‌ఎం దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాఠశాలలో నవోదయ పరీక్ష రాసేందుకు సిద్ధమవుతున్న 11 మంది 5వ తరగతి విద్యార్థులకు నవోదయ ఎంట్రన్స్ కోచింగ్ స్టడీ మెటీరియల్‌ను దాత యల్లపు సతీష్ తదితరుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ కార్యదర్శి ముంజులూరి దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు ఎస్.అనంతలక్ష్మి, డి.కిరణ్‌కుమార్, కె.రమాదేవి, ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.. మట్టిబొమ్మల రూపం

» 50 సంవత్సరాలుగా దేవతా విగ్రహాల తయారీ.. » పర్యావరణ పరిరక్షణకు నడుంబిగించిన పట్టభద్రుడు


మట్టి వినాయక విగ్రహాలకు రంగులు అద్దుతున్న వెంకటరమణ


మట్టితో శివలింగాన్ని తయారు చేస్తున్న కళాకారుడు రమణ

ఎలమంచిలి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుడే కానీ..ధనార్జన కంటే పర్యావరణ హితమే బాధ్యతగా భావించి 50 ఏళ్లగా మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నారు.. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో బొమ్మలు తయారు చేస్తే మంచి లాభం వస్తుందని తెలిసి కూడా వాటి జోలికి వెళ్లకుండా పర్యావరణమే ప్రధానమని మట్టి బొమ్మలనే తయారు చేసి హోల్‌సేల్‌గా విక్రయిస్తున్నారు పట్టణంలోని కొత్తపేటకు చెందిన విరోతి వెంకట రమణ.

ఎలమంచిలి కొత్తపేట ప్రాంతానికి చెందిన విరోతి వెంకట రమణ బీకాం వరకు చదివాడు. తన తాత, తండ్రిల నుంచి వచ్చిన బొమ్మల తయారీ వృత్తిని రమణ కూడా కొనసాగిస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నాడు. స్వచ్ఛమైన మట్టితో ఈ కళాకారుడి చేతిలో రూపుదిద్దుకుంటున్న దేవతామూర్తుల విగ్రహాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. తన తాతల కాలం నుంచి వస్తున్న ఆచారాన్ని, విలువలను పాటిస్తున్నారు. అధిక డబ్బులు ఇస్తామన్నా సరే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు జోలికి వెళ్లనని వెంకటరమణ చెబుతున్నాడు. వినాయక చవితి, దసరా ఉత్సవాలు, శ్రీరామనవమి, శ్రీకృష్ణాష్టమి వేడుకలు సమయంలో దేవతామూర్తుల మట్టి ప్రతిమలు తయారు చేయడం ఈయన ప్రత్యేకత. రమణ మట్టి విగ్రహాలు హోల్‌సేల్‌గా కొనుగోలు చేసుకునేందుకు కాకినాడ, సీలేరు, చింతపల్లి వంటి ఒడిశా వంటి ప్రాంతాల నుంచి కూడా విగ్రహాలు కొనుగోలు చేసుకునేందుకు తరలివస్తుంటారు.

పర్యావరణ హితానికే మట్టి బొమ్మలు తయారీ : వెంకటరమణ

ఎలమంచిలిలో బీకాం వరకు చదువుకున్నాను. తాతల కాలం నుంచి మట్టి బొమ్మలు తయారు చేయడం మా వృత్తి. మా తండ్రి కూడా మట్టి బొమ్మలు మాత్రమే తయారు చేసేవారు. వారిలాగే దేవతామూర్తుల విగ్రహాలు తయారు చేసి విక్రయిస్తున్నాను. మట్టి విగ్రహాలను మాత్రమే తయారు చేస్తాను.

మునగపాక ఆలయంలో నెల రోజులు చవితి వేడుకలు

» ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు


మునగపాకలో పురాతన వినాయక మందిరం

మునగపాక, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలకు మండలంలో ఆలయాలు, మండపాలు సర్వాంగ సుందరంగా సిద్ధమవుతున్నాయి. మునగపాక సంతబయల ప్రాంతంలో వినాయక మందిరానికి దశాబ్దాలు చరిత్ర ఉంది. ఏటా ఇక్కడ చవితి వేడుకలను నెలరోజులు పాటు నిర్వహిస్తారు. ఇంట్లో జరిగే శుభ కార్యక్రమాలకు సంబంధించిన తొలి పత్రికను స్వామి పాదాలు చెంత ఉంచి పనులు మొదలు పెడతారు. తొలి ఫలసాయాన్ని స్వామివారికి రైతులు సమర్పిస్తారు. వివాహం అయిన కొత్త దంపతులు తొలి ఆలయ, స్వామి దర్శనం ఇక్కడ నుంచే మొదలవుతుంది. ఆలయ గర్భగుడిలో పాలరాతి విగ్రహంతోపాటు నల్లరాతి విగ్రహం కూడా పూజలందుకుంటోంది. ఆలయంలో వినాయక చవితి వేడుకలు సంప్రదాయబద్ధంగా నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ మందపాటి రాము తెలిపారు. చవితి వేడుకలకు ఏర్పాట్లను యువకులు, గ్రామస్థులు చేస్తున్నారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు : తహశీల్దార్


గుడివాడ ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న తహశీల్దార్ రమేష్‌బాబు, ఏవో సౌజన్య

పాయకరావుపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దారు ఎస్‌ఏ.మహేశ్వరరావు హెచ్చరించారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహశీల్దారు ఆధ్వర్యంలో ఎంపీడీఓ ఏ.జయప్రకాశరావు, ఏఓ ఆదినారాయణ తదితరులు పట్టణంతోపాటు మండలంలోని పాల్తేరులోని ఎరువుల దకాణాలు, మండలంలోని మూడు పీఏసీఎస్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల దుకాణాల్లో రికార్డులను పరిశీలించారు. ఎరువులు, పురుగు మందుల నిల్వలు, అమ్మకం ధరల పట్టిక అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ ఎరువులు కొనుగోలు చేసిన రైతుకు ఆథరైజ్డ్ బిల్లు ఇవ్వాలన్నారు. ఎరువులు నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా డీలర్లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ-2 సన్యాసిరావు, వ్యవసాయశాఖ సిబ్బంది నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీ ధరకే యూరియా విక్రయించాలి : ఏవో

ఎస్.రాయవరం: రైతులకు యూరియాను ఎంఆర్‌పీ ధరకే విక్రయించాలని, ధర పెంచి విక్రయించినట్టయితే కఠిన చర్యలు తప్పవని ఏవో సౌజన్య హెచ్చరించారు. మండలంలోని అడ్డరోడ్డు, గుడివాడ గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను సోమవారం తహశీల్దార్ రమేష్‌బాబు, ఏవో సౌజన్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రస్తుతం వరి సాగు చేస్తున్న రైతులకు మాత్రమే యూరియా విక్రయించాలని, వ్యవసాయేతర పనులకు యూరియా అమ్మకూడదన్నారు. అలాగే రైతులకు ఈపీవోఎస్ మిషన్ ద్వారా యూరియా అమ్మకాలు జరపాలని దుకాణదారులను ఆదేశించారు. ప్రస్తుతం గుడివాడ విశాఖ ఏజెన్సీ, దార్లపూడి, జేవీపాలెంల్లో గల రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందని, ఇప్పటికే యూరియా తీసుకోకుండా ఉన్న రైతులు అక్కడికి వెళ్లి తీసుకోవచ్చునని సూచించారు. మరో రెండు రోజుల్లో అన్ని రైతు సేవా కేంద్రాలతో పాటు ఎరువుల షాపుల్లో సరిపడా యూరియా అందుబాటులో ఉంటుందని సౌజన్య చెప్పారు. తహశీల్దార్ రమేష్‌బాబు మాట్లాడుతూ అడ్డరోడ్డులో గల మన గ్రోమోర్‌లో యూరియా లిక్విడ్ అందుబాటులో ఉందని, యూరియా పిండి కావల్సిన రైతులు దాన్ని కూడా వినియోగించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వీఆర్‌వోలు పాల్గొన్నారు.

కొబ్బరి కాయలకు గిరాకీ

» ఒక్కొక్కటి రూ.30 నుంచి రూ.35కి విక్రయం


మోసయ్యపేట సంతకు వచ్చిన కొబ్బరి కాయలు

అచ్యుతాపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోసయ్యపేట సంతలో సోమవారం కొబ్బరి కాయలను అధిక ధరలకు రైతులకు విక్రయించారు. గాజువాక రోడ్డులోని గురుకుల పాఠశాల జంక్షన్ వద్ద ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో మోసయ్యపేట సంత జరుగుతుంది. ఈ సంతల్లో ఎక్కువగా కూరగాయలతో పాటు కొబ్బరి కాయలు కూడా విక్రయిస్తారు. అయితే సోమవారం ఉదయం కూరగాయలు కన్నా కొబ్బరి కాయలు అధికంగా వచ్చాయి. అనకాపల్లి, విశాఖ, కాకినాడ జిల్లాలతో పాటు ఒడిశా నుంచి వచ్చిన వ్యాపారులు కూరగాయలతోపాటు కొబ్బరి కాయలను భారీగా కొనుగోలు చేశారు. గతంలో కొబ్బరి కాయ రూ.15 నుం చి రూ.20కి విక్రయించేవారు. సోమవారం మాత్రం కాయ సైజును బట్టి రూ. 30 నుంచి రూ.35కి వ్యాపారులు కొనుగోలు చేశారు. దీంతో రైతుల సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. వినాయక చవితి సందర్భంగా వ్యాపారులు అధిక ధరలకు కొబ్బరికాయలు కొనుగోలు చేశారు.

పాఠశాలల బలోపేతానికి నిరంతర కృషి

» ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటపతిరాజు


ఏపీటీఎఫ్ సభ్యత్వాల నమోదు చేపడుతున్న వెంకటపతిరాజు

నక్కపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ సంఘం అంకితభావంతో పోరాటం సాగిస్తోందని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటపతిరాజు చెప్పారు. సోమవారం మండలంలోని పలు పాఠశాలల్లో సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. తమ యూనియన్ చేస్తున్న పనులు, ప్రణాళికల గురించి వెంకటపతిరాజు ఉపాధ్యాయులకు వివరించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కృష్ణ, అప్పలరాజు, పాల్గుణరావు, రాష్ట్ర కౌన్సిలర్ కొండలరావు, శ్రీను, చిన్నారావు, రంగబాబు, తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలను పూజించండి

» లారస్ ల్యాబ్స్ ప్రెసిడెంట్ నరసింహారావు


మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రజలుంతా మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలని లారస్ ల్యాబ్స్ కర్మాగారం ప్రెసిడెంట్ చావా నరసింహారావు అన్నారు. సోమవారం దిబ్బపాలెం వాసులకు ఆయన మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, దీనికోసం అంతా ప్రకృతి సిద్ధంగా తయారు చేసిన మట్టి వినాయకుడినే పూజించాలన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ కె.మెహర్ కుమార్, కర్మాగారం ఉద్యోగులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన : ధర్మశ్రీ


కార్యక్రమంలో మాట్లాడుతున్న సమన్వయకర్త ధర్మశ్రీ

మునగపాక, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని వైసీపీ ఎలమంచిలి నియోజకవర్గం సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలో చెర్లోపాలెం, మడకపాలెం, రామగిరి గ్రామాల్లో సోమవారం బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ పేరుతో రచ్చబండ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు హామీలు పూర్తిస్థాయిలో అమలు చేయని ప్రభుత్వం ఎరువుల కొరతపై తప్పుడు ప్రకటనలు చేస్తోందన్నారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ అనేక మంది వికలాంగులు పింఛన్‌లు తొలగించడం సరికాదన్నారు. మండల వైసీపీ అధ్యక్షుడు ఆడారి గణపతి అచ్చింనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సర్పంచ్ దొడ్డి వెంకటసూరిఅప్పారావు, బొద్దపు శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

'దివ్యాంగుల పెన్షన్లు రద్దు తగదు'

అచ్యుతాపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల పెన్షన్‌ని పెంచి లబ్ధిదారుల సంఖ్యకు కోత పెట్టిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము ఆరోపించారు. సోమవారం అచ్యుతాపురం ఎంపీడీఓ కార్యాలయం వద్ద జరిగిన దివ్యాంగుల ధర్నాలో ఆయన మాట్లాడుతూ మండలంలో 160 మంది దివ్యాంగులకు రీవెరిఫికేషన్ పేరుతో పెన్షన్‌లు నిలిపివేశారన్నారు. చిన్నచిన్న సాంకేతిక కారణాలు చూపి పెన్షన్‌లు నిలిపివేయడం అన్యాయమన్నారు. వెంటనే అర్హులైన వారందరికీ పెన్షలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓ సత్యవరాహ శ్రీనివాసరావుకి వినతిపత్రాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో కె సోమినాయుడు, పెట్ల వరహాలమ్మ, పిల్ల జగదీష్ పాల్గొన్నారు.

మురుగు నీరు తొలగింపు

» ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


మురుగు నీటిని తొలగించిన దృశ్యం

అచ్యుతాపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం-గాజువాక రోడ్డులో మరిడిమాంబ ఆలయం వద్ద రోడ్డుపై నిలిచిపోయిన మురికి నీటిని తొలగించామని ఎంపీడీఓ సత్య వరాహ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం 'రోడ్డుపై మురికి నీరు' అన్న శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ రోడ్డులో తూము మట్టి, తుప్పలతో మూసుకుపోవడంతో నీరు ఎటూ వెళ్లక మరిడిమాంబ ఆలయ ప్రాంగణం, రోడ్డుమీదకు వచ్చేసిందన్నారు. సిబ్బందితో తూములో పేరుకుపోయిన చెత్తను తొలగించి మురికి నీటిని బయటకు పంపామని ఆయన తెలిపారు.

జనసేన సమావేశాలకు మీడియా సమన్వయ కమిటీ సభ్యుడిగా తోట నగేశ్



పాయకరావుపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో జరగనున్న జనసేన పార్టీ విస్తృతస్థాయి సమావేశాలకు మీడియా సమన్వయ కమిటీ సభ్యుడిగా ఆ పార్టీ సీనియర్ నాయకుడు తోట నగేశ్ నియమితులయ్యారు. సోమవారం పార్టీ అధిష్ఠానం నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 28, 29, 30 తేదీల్లో విశాఖలో జరగనున్న జనసేన పార్టీ విస్తృత స్థాయి సమావేశాలు, పార్టీ బహిరంగ సభలను విజయవంతం అయ్యేందుకు తన వంతు కృషిచేస్తానన్నారు.

మండపాల్లో విద్యుత్ సరఫరాకు విధిగా అనుమతులు

మునగపాక, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక మండపాల్లో విద్యుత్ సరఫరాకు నిర్వాహకులు విధిగా అనుమతులు తీసుకోవాలని స్థానిక సెక్షన్ కార్యాలయ ఏఈ శరగడం జగదీశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండపాల్లో విద్యుత్ సరఫరాకు వినియోగించే వైర్ల విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. జాయింట్ కలిగిన వైర్లతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా లోడ్ క్రమబద్ధీకరణకు సంబంధించి 50 శాతం రాయితీ డిసెంబర్ 31వ తేదీ వరకు ఉందన్నారు. వాస్తవానికి ఇటీవల గడువు ముగిసిందని, వినియోగదారులు అభ్యర్థనను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం గడువు పెంచిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అవకాశమిస్తే.. టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా చేస్తా..

రాష్ట్ర తెలుగురైతు కార్యనిర్వాహక కార్యదర్శి దాడి

మునగపాక, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం అవకాశమిస్తే టీడీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నానని తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి మునిలినాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 24వ తేదీన అనకాపల్లి టీడీపీ పార్లమెంటరీ కార్యాలయంలో పార్టీ సంస్థాగత నిర్మాణ సమావేశం జరిగిందన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి తెలుగుదేశం పార్టీలోనే కొనసాగుతున్నానని, జిల్లా అధ్యక్ష పదవికి తన పేరు కూడా పరిశీలించగలరని సమావేశం దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు.

నేడు మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

ఎలమంచిలి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి మునిసిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అధ్యక్షతన జరిగే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

నేడు మండల సమావేశం

ఎలమంచిలి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తామని ఎంపీడీఓ కేఎస్.కొండలరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ బోదెపు గోవింద్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు అభివృద్ధి నివేదికలతో హాజరు కావాలని కోరారు. ప్రజాప్రతినిధులకు ఇప్పటికే సమాచారం పంపామన్నారు.

31న కశింకోటలో ఐద్వా జిల్లా మహాసభలు

అచ్యుతాపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఈనెల 31న కశింకోటలో జరిగే ఐద్వా జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా సంయుక్త కార్యదర్శి సీహెచ్ మంగతాయారు కోరారు. సోమవారం అచ్యుతాపురంలో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సమావేశాల్లో కార్మికుల సమస్యలపై చర్చలు జరుగుతాయాన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్. కుమారి, జే విజయ, ఆర్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

నక్కపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నక్కపల్లిలో సోమవారం సాయంత్రం పెను ప్రమాదం తృటిలో తప్పింది. హైదరాబాద్ నుంచి విశాఖ వస్తున్న ప్రైవేట్ బస్సు నక్కపల్లి జంక్షన్ వద్ద ప్రమాదానికి గురైంది. ముందు వెళ్తున్న లారీని డ్రైవర్ సడన్‌గా నిలిపివేయడంతో వెనుక వస్తున్న బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం ధ్వంసమైంది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

గాయపడిన మిత్రుడికి పూర్వ విద్యార్థుల సాయం

మునగపాక, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తీవ్రంగా గాయపడిన మిత్రుడుకు పూర్వపు విద్యార్థులు అండగా నిలిచారు. సోమవారం మునగపాక గ్రామానికి చెందిన కస్పా అప్పలనాయుడు ఇటీవల బస్సు ప్రమాదంలో రెండు కాళ్లకు తీవ్ర గాయాలై మంచానికే పరిమితమయ్యాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానిక జడ్పీ హైస్కూల్ 1999-2000 పదో తరగతి పూర్వ విద్యార్థులు అప్పలనాయుడు ఇంటికి వెళ్లి మిత్రుడి కుటుంబానికి సాయం చేశారు. ఈ కార్యక్రమంలో పిళ్లా జగదీష్, టెక్కలి అప్పలనాయుడు, దాడి అరుణ్‌కుమార్, విల్లూరి రాము ఉన్నారు.

జాతీయ రహదారిపై నిబంధనలు పాటిస్తూ ప్రయాణాలు

- వాహనదారులకు డీఎస్పీ శ్రావణి సూచన
- ఎన్‌హెచ్‌ఐ మేనేజర్, సీఐలతో కలిసి బ్లాక్ స్పాట్‌ల పరిశీలన



పిసినికాడ జాతీయ రహదారిపై బ్లాక్‌స్పాట్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణి

కొత్తూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై ఉన్న బ్లాక్ స్పాట్‌లను డీఎస్పీ ఎం.శ్రావణి సోమవారం పరిశీలించారు. ఎన్‌హెచ్‌ఐ రాజమండ్రి మేనేజర్ నవీన్, అనకాపల్లి రూరల్ సీఐ అశోక్‌కుమార్, ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ, ఎస్‌ఐ రవికుమార్‌లతో కలిసి జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న డైట్ కళాశాల, జగలమదుం జంక్షన్, కొప్పాక జంక్షన్, మారేడుపూడి జంక్షన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రయాణించేటప్పుడు వాహనదారులు విధిగా నిబంధనలు పాటించాలని సూచించారు. రహదారులపై జరిగే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని నిర్దేశించిన వేగంతో మాత్రమే ప్రయాణం చేయాలన్నారు. ఇప్పటికే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని చెప్పారు. అలాగే, వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఆయా జంక్షన్‌లలో స్టాప్ బోర్డులను ఏర్పాటు చేశామని, వాహనదారులకు అందుకు అనుగుణంగా ప్రయాణాలను సాగించాలని సూచించారు.

టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై విచారణ జరపాలి



సమావేశంలో పాల్గొన్న సీపీఐ నాయకులు భద్రం, తదితరులు

తుమ్మపాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి పట్టణంలోని గృహ నిర్మాణదారులపై దౌర్జన్యాలకు దిగుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా నాయకుడు వైఎన్ భద్రం మాట్లాడారు. పేద, మధ్యతరగతి కుటుంబాలవారు తమ ఇళ్లకు మరమ్మతులు చేపట్టుకుంటుంటే టౌన్‌ప్లానింగ్ అధికారులు వచ్చి దౌర్జన్యాలకు దిగుతున్నారని ఆరోపించారు. నిర్మాణదారుల దగ్గర నుంచి పనిముట్లను తీసుకువెళ్లిపోయి వేలాది రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది సైతం జీతాలతో పనిలేకుండా అన్యాయంగా లక్షల రూపాయలు సంపాదిస్తూ విలాసవంతమైన జీవితాలు గడుపుతున్నారని పేర్కొన్నారు. వీరిపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు తాకాశి వెంకటేశ్వరరావు, మత్తుర్తి మహేష్, కొణతాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలని జడ్పీకి రైతుల వినతి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గవరపాలెం మరిడిమాంబ ఆలయం వద్ద ఆక్రమణలను తొలగించి, రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత రైతులు జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆయనను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. గతంలో జాతీయ రహదారి నుంచి ఆలయానికి భక్తులు రావడానికి అనుగుణంగా 30 అడుగుల వెడల్పులో రహదారి నిర్మాణం చేపట్టారని బీఎస్ఎంకే జోగినాయుడు కమిషనర్‌కు వివరించారు. ఈ రోడ్డును పక్కాగా నిర్మించేందుకు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ నిధులు మంజూరు చేశారన్నారు. అయితే మరిడిమాంబ ఆలయ మలుపులో ఆక్రమణల వల్ల రోడ్డు నిర్మాణానికి ఇతర రైతులు కూడా ముందుకు రావడం లేదన్నారు. అందువల్ల ఆక్రమణలను తొలగించి భక్తుల సౌకర్యార్థం పక్కా రోడ్డు నిర్మాణానికి చొరవ చూపాలని కోరారు. అలాగే, పట్టణంలోని సచివాలయాల్లో ఏఏ విభాగాల్లో ఎంతమంది ఎన్టీఆర్ భరోసా పింఛన్ అందుకుంటున్నారో ఆ వివరాలను సచివాలయాల్లో ఏర్పాటు చేయాలని మామిడి నూకరాజు విన్నవించారు.

పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ బహూకరణ



పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్‌ను అందజేస్తున్న ఫ్యాక్టరీ ప్రతినిధులు

కశింకోట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు బయ్యవరంలో సాగర్ సిమెంటు యాజమాన్యం రూ.60 వేలు విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్‌ను బహూకరించింది. ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ ఎన్.వి. ప్రసాదరావు సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయిని స్వర్ణకుమారికి వీటిని అందజేశారు. కంప్యూటర్ విద్యకు విద్యార్థినులు దూరంగా ఉంటున్నారని గతంలో కంపెనీ యాజమాన్యం దృష్టికి తాము తీసుకు వెళ్లడంతో వీటిని సమకూర్చడం పట్ల ఆమె అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చట్టాలపై బాలికలకు అవగాహన సదస్సు



సదస్సులో పాల్గొన్న ఏఎస్‌ఐ మణికుమారి, పాఠశాల సిబ్బంది

కశింకోట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లపాలెంలో గల పాఠశాలలో బాలికల రక్షణ, బాల్య వివాహాల వల్ల అనర్థాలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ మణికుమారి మాట్లాడుతూ ఆకతాయిల పట్ల బాలికలు జాగ్రత్తగా ఉండాలన్నారు. పోక్సో చట్టం, శక్తి మొబైల్ యాప్ వినియోగం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పట్ల విద్యార్థులు ఏ విధంగా ప్రవర్తించాలి తదితర అంశాలను ఆమె వివరించారు. ప్రధానంగా బాలికలు ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య ప్రతినిధి డి.రవి, ప్రధానోపాధ్యాయిని లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మెచ్చేలా పాలన

- కేంద్ర సహకారం, సీఎం చంద్రబాబు అనుభవంతో రాష్ట్రం అన్నింటా అభివృద్ధి
- విజయవంతంగా కొనసాగుతున్న సంక్షేమ పథకాలు
- సచివాలయ నూతన భవన ప్రారంభోత్సవంలో ఎంపీ సీఎం రమేశ్



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ రమేశ్, చిత్రంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, చైర్మన్ గండి బాబ్జీ

సబ్బవరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలు నచ్చేలా, మెచ్చేలా పాలన సాగిస్తుందని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. మండలంలోని మొగలిపురంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సహకారం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనుభవంతో రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకుపోతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన పథకాలకు మించి తమ ప్రభుత్వం పథకాలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. సూపర్ సిక్స్‌లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ఉచిత గ్యాస్, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలు విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. అంతకంటే ముఖ్యంగా శాంతిభద్రతలు పక్కాగా అమలు జరుగుతున్నట్టు స్పష్టం చేశారు. సర్పంచ్ గండి అరుణ, ఎంపీటీసీ తమరాన సన్యాసమ్మ, పీఏసీఎస్ చైర్మన్ గండి దేముడు, కూటమి నాయకులు గండి వంశీదీప్, గొర్లి రామునాయుడు, గండి ముత్యాలనాయుడు, కర్రి కనకరాజు, ఇందలి రమణ, బి.ఎ.రావు, మిడతాడ మహాలక్ష్మీనాయుడు, తమరాన బంగారు నాయుడు, అంగటి నానాజీ, పల్ల తాతారావు, మేడిశెట్టి రాము, కరణం రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మళ్ల సురేంద్ర జన్మదిన వేడుకలు



వైద్యాలయంలో రోగికి పండ్లు, రొట్టెలు అందిస్తున్న టీడీపీ నాయకులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర జన్మదిన వేడుకలను సోమవారం మళ్ల సురేంద్ర మిత్ర మండలి ఆధ్వర్యంలో పట్టణంలోని పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ వైద్యాలయంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. సిబ్బందికి చీరలు పంపిణీ చేసి జన్మదిన కేక్ కట్ చేశారు. కోట్నివీధి యూపీహెచ్‌ఎస్‌కు టీడీపీ నాయకులు పొలిమేర ఆనంద్, ఎస్.భానుచందర్ (అబి) ఆధ్వర్యంలో ఐదు సీలింగ్ ఫ్యాన్లు అందజేశారు. ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు. రెండు అన్న క్యాంటీన్‌లలో సురేంద్ర పేరిట ఉచితంగా భోజనం ఏర్పాటు చేశారు. నెయ్యిల వీధిలో వైద్య శిబిరం నిర్వహించారు. తెలుగు యువత నాయకులు మళ్ల రాజేష్ ఆధ్వర్యంలో నిరుపేదలు, అనాథలకు దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేసి భోజనం ఏర్పాటు చేశారు. పరమేశ్వరీ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులు మొక్కలు నాటారు. పెరుగుబజార్ జంక్షన్‌లో పీలా మోహన్ ఆధ్వర్యంలో పేదలకు భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు బీఎస్ఎంకే జోగినాయుడు, కాయల మురళీ, బొద్దపు ప్రసాద్, ఆడారి మూర్తిసాయి, పచ్చికూర రాము, సబ్బవరపు గణేశ్, మళ్ల సంతోష్, కాండ్రేగుల సత్యనారాయణ, బొడ్డేడ శ్రీనివాసరావు, మేడిశెట్టి నూకరాజు, దాడి వాసు, బొడ్డేడ మురళీ తదితరులు పాల్గొన్నారు.



కోట్నివీధి పాఠశాలకు ఫ్యాన్లు వితరణగా అందిస్తున్న నాయకులు

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



మట్టి గణపతి విగ్రహాలను అందిస్తున్న జడ్పీ చక్రవర్తి తదితరులు



మామిడిపాలెంలో ర్యాలీ హైస్కూల్ సిబ్బంది, విద్యార్థులు

అనకాపల్లి టౌన్/కొత్తూరు/తుమ్మపాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి సందర్భంగా సోమవారం పలుచోట్ల మట్టి విగ్రహాల పంపిణీ చేపట్టారు. పట్టణంలోని జీవీఎంసీ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులకు సామూహిక వినాయక నిమజ్జన కమిటీ వ్యవస్థాపకులు ఆడారి కుమారస్వామి ఆధ్వర్యంలో జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి విగ్రహాల పంపిణీ చేట్టారు. శానిటేషన్ సూపర్‌వైజర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. నెహ్రూచౌక్‌లో దాడి విద్యాసంస్థల ఆధ్వర్యంలో విద్యా సంస్థల చైర్మన్ దాడి రత్నాకర్ ప్రజలకు విగ్రహాల పంపిణీ జరిపారు. డీవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎస్ఆర్ జమీర్, యు.నాగేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే, కన్యకాపరమేశ్వరి దేవస్థానం కూడలి శ్రీకారం సేవా సమితి, సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నేతల ఆధ్వర్యంలో బొమ్మలను పంపిణీ చేశారు. ఆయా సంఘాల ప్రతినిధులు జొన్నకోట చెన్నమూర్తి, సూదికొండ మాణిక్యాలరావు, చందాన కృష్ణ, ఉమాశంకర ప్రసాద్ పాల్గొన్నారు. మామిడిపాలెంలో హైస్కూల్ హెచ్‌ఎం శ్రీధర్ ఆధ్వర్యంలో విద్యార్థులు పర్యావరణం పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు గొంది చినబ్బాయి, ఈశ్వరబాబు, నాగమణి, నూకేశ్వరరావు, వరప్రసాద్, శ్రీను పాల్గొన్నారు.

సబ్బవరం : మట్టి వినాయక విగ్రహాలను సోమవారం ఇక్కడ శాప్ డైరెక్టర్ పీబీవీఎస్‌ఎన్ రాజు కుటుంబ సభ్యులు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనుప్రియాంక, ప్రణతి, సురేష్‌వర్మ, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్లకు సత్కారం



మార్కెట్ కమిటీ డైరెక్టర్లను సత్కరించిన టీడీపీ నాయకులు

పరవాడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తి మార్కెట్ కమిటీ నూతన డైరెక్టర్లుగా ఇటీవల ఎన్నికైన గొర్లి కనకారావు, కొత్తపల్లి అపర్ణలను సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. పార్టీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న ఇరువురు డైరెక్టర్లను శాలువాలతో కప్పి సత్కరించి, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు బొండా తాతారావు, రాయవరపు దేముడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సారిపల్లి జోగినాయుడు, గొర్లి శ్రీనివాస్, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు పైలా వరలక్ష్మి, నాయకుడు బండారు మునిలినాయుడు, బైలపూడి రాజు, ధనరాజ్, గొర్లి సోమినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేత కుటుంబానికి ఎంపీ పరామర్శ

కొత్తూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండబాబు కుటుంబాన్ని ఎంపీ సీఎం రమేష్ సోమవారం పరామర్శించారు. ఈ మేరకు ఇక్కడి బీఆర్‌టీ కాలనీలో ఉన్న ఆయన ఇంటికి వెళ్లి కొండబాబు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కుటుంబసభ్యులకు భరోసా కల్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బొడ్డేడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తేగాడ మోడల్ స్కూల్‌లో

అవకతవకలు జరిగాయని కలెక్టర్‌కు ఫిర్యాదు

కశింకోట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తేగాడ మోడల్ స్కూల్‌లో అవక తవకలు జరిగినట్టు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు స్కూల్ కమిటీ వైస్ చైర్మన్ శిలపరశెట్టి చిట్టమ్మ సోమవారం ఫిర్యాదు చేశారు. ప్రిన్సిపాల్ పర్యవేక్షణ లోపం వల్ల విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. హాస్టల్‌లో భోజనం సరిగా లేకపోవడంతో పలువురు టీసీలు తీసుకొని వెళ్లిపోయిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఇక్కడ రెండు ద్వారాలకు సీసీ కెమెరాలు లేకపోవడం వల్ల బయటి వ్యక్తులు హాస్టల్‌లో సంచరిస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా ఔట్‌సోర్సింగ్ కింద కంప్యూటర్, ఐటీ తరగతులు బోధించాల్సిన సిబ్బంది ఆయా పాఠాలు సరిగా చెప్పడం లేదని విద్యార్థినుల ఫిర్యాదు చేసినా ప్రిన్సిపాల్ పట్టించుకోలేదన్నారు. పాఠశాలలో జరిగే కార్యక్రమాలకు తమకు ఎటువంటి సమాచారం లేకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదులు చేశామని చెప్పారు. వెంటనే విచారణ జరిపించాల్సిందిగా విన్నవించారు.

'ఎ.సిరసపల్లిలో భూములు ప్రభుత్వానికి ఇచ్చేది లేదు'

సబ్బవరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ల్యాండ్ పూలింగ్‌కు మండలంలోని శివారు గ్రామం అద్దూరు సిరసపల్లిలో భూములను ఇచ్చేది లేదని ఆ గ్రామంతో పాటు బంగారమ్మపాలెం గ్రామ రైతులు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఎ.సిరసపల్లి, బంగారమ్మపాలెం గ్రామాల్లో సుమారు 230 కుటుంబాలు తరతరాలుగా ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నట్టు చెప్పారు. వరితో పాటు జీడి, జీడిమామిడి, జామ తదితర పంటలు సాగు చేస్తున్నామన్నారు. అయితే ఈ నెల ఏడో తేదీన తహశీల్దార్ గ్రామసభ నిర్వహించి ల్యాండ్ పూలింగ్ కింద ప్రభుత్వం భూములు తీసుకుంటున్నట్టు తెలిపారన్నారు. తమ గ్రామాల్లో ప్రభుత్వ భూములే ఎక్కువగా ఉన్నాయని, వీటిని సాగుచేసుకుంటూ నెట్టుకొస్తున్నామని వివరించారు. ఈ పరిస్థితిలో గ్రామ పెద్దలతో సహా అందరం కలిసి సమావేశమై భూములు ఇవ్వకూడదని నిర్ణయించుకున్నట్టు చెప్పారు. తమకు జీవనోపాధిగా ఉన్న భూముల సమీకరణ నిలిపి వేసి న్యాయం చేయాల్సిందిగా వారంతా కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాడి లావణ్య, దాడి కన్నం నాయుడు, ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరమేశ్వరీ పార్కులో స్విమ్మింగ్‌పూల్‌కు చర్యలు



అనకాపల్లి టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గవరపాలెం పరమేశ్వరీ పార్కులో స్విమ్మింగ్‌పూల్ ఏర్పాటు చేసేందుకు జీవీఎంసీ జోనల్ అధికారులు సన్నాహాలు చేపడుతున్నారు. పార్కు లోపల ఖాళీగా ఉన్న ప్రదేశంలో ఏర్పాటు చేసి ఇక్కడి వారికి అందుబాటులోకి తేనున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి నమూనాను సిద్ధం చేశారు. ప్రస్తుతం అనకాపల్లిలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయి, వాటికి నిర్మాణానికి ఎంత ఖర్చయ్యింది తదితరాలను ఆయా నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. సుమారు 50 లక్షల రూపాయలతో ఈ స్విమింగ్‌పూల్ నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నట్టు సమాచారం.



పార్కులో ఏర్పాటు చేయనున్న స్విమ్మింగ్‌పూల్ నమూనా

బాబాను దర్శించుకున్న కొణతాల



బాబాను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కొణతాల

కశింకోట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పల్లపుసోమవరంలో గల షిర్డీసాయి ఆలయంలో బాబాను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సోమవారం దర్శించుకున్నారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా వేకువజాము నుంచి సాయినాథునికి అర్చకులు విశేష పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ వ్యవస్థాపకుడు గొంతిన శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కశింకోటలో సమావేశమైన పారిశుధ్య కార్మికులు

కశింకోట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జి.కొండబాబు, దాకారపు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం ఇక్కడ పారిశుధ్య కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పంచాయతీ కార్మికులకు ప్రతి నెలా సకాలంలో వేతనాలు చెల్లించాలని, హెల్త్ ఇన్సూరెన్సు, పీఎఫ్, ఈఎస్‌ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని, అర్హులైన వారికి శాశ్వత ఉద్యోగాలు కల్పించడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. యూనియన్ ప్రతినిధులు సత్తిబాబు, అబ్బులు, అర్.అప్పలనరసమ్మ, టి.అంజి, ఇ.అర్జునమ్మ, పెద్ద అప్పారావు, పోలయ్య, అప్పలకొండ, నూకరత్నం, సూరప్పారావు, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

'మునగ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం'

సబ్బవరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మునగ సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తుందని ఇన్‌చార్జి ఎంపీడీవో శివప్రసాద నారాయణ రావు సోమవారం తెలిపారు. మునగ ఉత్పత్తులకు గిరాకీతో పాటు అనేక ఆరోగ్యపరమైన ఉపయోగాలు ఉన్నందున రాష్ట్రవ్యాప్తంగా మునగ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా మునగ మొక్కలు ఉచితంగా పంపిణీ చేయడమే కాకుండా గోతులు తవ్వేందుకు, ఎరువులు, కూలీ చార్జీలు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం చెల్లిస్తున్నట్టు వివరించారు. అంతేకాకుండా మునగ ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. కనీసం ఇరవై సెంట్ల భూమి కలిగిన రైతు నుంచి ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవచ్చునన్నారు. దీనిపై ఎటువంటి సందేహాలు ఉన్నా నివృత్తికి ఉపాధి హామీ పథకం అధికారులను సంప్రదించాల్సిందిగా ఆయన సూచించారు.

వీఓఏల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్షురాలిగా రూపాదేవి, కార్యదర్శిగా వెంకటలక్ష్మి



వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు రూపాదేవి, కార్యదర్శి వెంకటలక్ష్మి, కోశాధికారి రాజేశ్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామ సహాయకుల సంఘం (వీఓఏ) జిల్లా నూతన కమిటీ ఎన్నిక సోమవారం ఇక్కడ సీఐటీయూ కార్యాలయంలో చేపట్టారు. గౌరవ అధ్యక్షునిగా వీవీ శ్రీనివాసరావు, అధ్యక్షురాలిగా సీహెచ్. రూపాదేవి, కార్యదర్శిగా ఎం.వెంకటలక్ష్మి, కోశాధికారిగా సీహెచ్‌ఎల్ఎన్ రాజేశ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా కె.కనకలక్ష్మి (కోటవురట్ల), ఎం.రాజ్యలక్ష్మి (నర్సీపట్నం), జి.సత్యవతి (రావికమతం), అప్పలనాయుడు (చీడికాడ), భవాని (కశింకోట), ఉష (మునగపాక), కె.సూరిబాబు (దేవరాపల్లి), లావణ్య (అచ్యుతాపురం), క్రాంతి (నాతవరం), రాము (అనకాపల్లి) ఎన్నికయ్యారు. మరో 25 మందిని జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

'ఆరు, ఏడు తేదీల్లో చోడవరంలో సీఐటీయూ జిల్లా మహాసభలు'

అనకాపల్లి టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ జిల్లా మహాసభలను సెప్టెంబరు ఆరు, ఏడు తేదీల్లో చోడవరంలో నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధ్యక్షుడు పీఎస్‌వీ పరమేశ్వరరావు తెలిపారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అసంఘటిత కార్మికులకు రక్షణ కల్పించాలని, ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. భారీ వాహనాలను పగటిపూట అనకాపల్లి పట్టణంలోకి అనుమతించకపోవడం వల్ల ముఠా కార్మికుల ఉపాధిపై ప్రభావం పడిందని అన్నారు. ఈ సందర్భంగా మండల సమన్వయ కమిటీని నియమించారు. కన్వీనర్‌గా కాళ్ల తేలయ్యబాబు, సభ్యులుగా పీఎస్‌వీ పరమేశ్వరరావు, గంటా శ్రీరామ్, మందా రాము, పి. సురేశ్, బోడి రాజు, వై.ఏసురాజు, బొమ్మాల రాము, ఎస్.వరలక్ష్మి, ఎం.సూర్యకళ, ఎం.సూర్యలక్ష్మి, ఎం.అప్పలరాజు, బి.అప్పారావు, ఎంపీ నాయుడు, కె.నాయుడు, కె.నాగేశ్వరరావు, వారాది సత్యనారాయణ, కొండారావు ఎన్నికయ్యారు.

నేత్రదాన పక్షోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



నేత్రదాన పక్షోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ తనూజరాణి, కలెక్టర్ దినేశ్‌కుమార్, తదితరులు

పాడేరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో అరకులోయ ఎంపీ డాక్టర్ జి.తనూజరాణి, జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ సోమవారం 40వ జాతీయ నేత్ర పక్షోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా పలువురికి ఆదర్శంగా నిలుస్తూ జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్, ఎంపీ డాక్టర్ తనూజరాణి, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్ గౌడ, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వరనాయుడు తన నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చి నేత్రదాన పత్రాలపై సంతకాలు చేశారు. ఈనెల25 నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు జరుగుతాయని, మరణించిన అనంతరం మీకిష్టమైన వ్యక్తికి కళ్లదానం చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ శౌర్యమన్ పటేల్, అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, తదితరులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవోగా అప్పలస్వామి



పాడేరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం డివిజనల్ పరిపాలనాధికారిగా కొమ్ము అప్పలస్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనకు పదోన్నతి కల్పిస్తూ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పరిపాలనాధికారిగా కలెక్టర్ నియమించారు. సోమవారం బాధ్యతలు చేపట్టిన అప్పలస్వామికి సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, తహశీల్దార్లు అభినందనలు తెలిపారు.

జీకే వీధి ఎస్‌ఐగా సురేశ్



గూడెంకొత్తవీధి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్‌గా కె.సురేశ్ నియమితులయ్యారు. రెండేళ్ల పాటు ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐని అప్పలసూరిని స్పెషల్ బ్రాంచికి బదిలీ చేస్తూ ఆయన స్థానంలో టాస్క్‌ఫోర్సులో పనిచేస్తున్న సురేశ్‌ని నియమిస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు సోమవారం నూతన ఎస్‌ఐ బాధ్యతలు స్వీకరించారు.

సీఐటీయూ మండల కన్వీనర్‌గా సత్యనారాయణ

గూడెంకొత్తవీధి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ మండల కన్వీనర్‌గా సత్యనారాయణ, కో-కన్వీనర్‌గా అప్పలనరసమ్మ ఎన్నికైనట్టు జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో సీఐటీయూ నూతన కార్యవర్గాన్ని కార్మికులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చిన్నయ్యప పడాల్ మాట్లాడుతూ కన్వీనర్, కో-కన్వీనర్‌తోపాటు 15మంది సభ్యులను కార్మికులు ఎన్నుకున్నారన్నారు. జీకేవీధి ఐసీడీఎస్ ప్రాజెక్టుకి పూర్తి స్థాయి సీడీపీవోని నియమించాలని డిమాండ్ చేశారు.

ఒకటి నుంచి పాఠశాల విద్యార్థులకు ఆధార్ నమోదు

▸▸ జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్ గౌడ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ డాక్టర్.ఎంజే.అభిషేక్ గౌడ

పాడేరు రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విద్యార్థులకు సెప్టెంబరు 1వ తేదీ నుంచి పాఠశాల, కళాశాలల వద్ద ఆధార్ నమోదు చేయాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్ గౌడ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన ఐటీడీఏ కార్యాలయంలో గ్రామ, వార్డు సచివాలయ, ఐసీడీఎస్, పీఎంయూ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా పరిధిలో 5 నుంచి 7 ఏళ్లలోపు వయస్సు గల వారు 21,630 మంది, 15 నుంచి 17 ఏళ్ల వయస్సు గల వారు 10,969 మందికి ఆధార్ కార్డులు లేవన్నారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి రెండు నెలల్లోగా జిల్లాలో ఉన్న పాఠశాలల విద్యార్థులకు ఆధార్ కార్డులు జారీ చేయాలని సూచించారు. ప్రతి రోజూ కనీసం 800 మంది విద్యార్థులకు ఆధార్ జారీ చేయాలన్నారు. ఈ ప్రక్రియను సీరియస్‌గా తీసుకొని నిర్ధేశిత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆధార్ లేకపోవడంతో ఈకేవైసీలు పెండింగ్‌లో ఉంటున్నాయన్నారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు, వార్డు సచివాలయ నోడల్ అధికారి పీఎస్.కుమార్, జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా సమన్వయకర్త కె.సునీల్, సీడీపీవో జి.శారద దేవి, పీఎంయూ ప్రోగ్రాం అధికారి రామ్‌గోపాల్, ఆధార్ కో-ఆర్డినేటర్ నాగరాజు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 51 మంది ఎంపిక



జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులు

పాడేరురూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జీఎంఆర్ పాలిటెక్నికల్ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాకు 141 మంది అభ్యర్థులు హాజరుకాగా 51 మంది ఎంపికయ్యారని జీఎంఆర్ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.హరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. ఈ జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 10 వేల నుంచి రూ. 20 వేలు వరకు వేతనం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు, కళాశాల మెకానికల్ హెడ్ రూప, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిణి డాక్టర్.పి.రోహిణి, ఏపీఎస్‌ఎస్‌డీసీ సిబ్బంది పాల్గొన్నారు.

14 గ్రామసభల్లో పెసా ఎన్నికలు : ఎంపీడీవో



ఎన్నిక ధ్రువపత్రం అందుకుంటున్న బైలుకించంగి ఉపాధ్యక్షుడు భీమన్న

చింతపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో 14 గ్రామసభల్లో పెసా ఎన్నికలు నిర్వహించామని ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి అన్నారు. సోమవారం 16గ్రామ సభలకు ఎన్నికలు నిర్వహించగా.. కోరం లేక తాజంగి, యర్రవరంలో వాయిదాపడ్డాయన్నారు. గొందిపాకలు గ్రామంలో ఉపాధ్యక్షుడుగా వనుము రామరాజు, కార్యదర్శిగా జోగిరాజు, చౌడుపల్లిలో ఉపాధ్యక్షుడుగా కొర్ర క్రిష్ణ, కార్యదర్శి గెమ్మెలి అప్పలస్వామి, లోతుగెడ్డ ఉపాధ్యక్షుడు సాగిన శ్రీరాములు, కార్యదర్శి కల్యాణం ప్రసాద్‌బాబు, బయలుకించంగి ఉపాధ్యక్షుడు గెమ్మెలి భీమన్న, యర్రబొమ్మలు ఉపాధ్యక్షుడు బేరా హరిబాబు, కార్యదర్శి వెలుసూరి సింహాచలం, రోలంగి ఉపాధ్యక్షుడు తాంబిలి కామరాజు, కార్యదర్శి కుమ్మరి భవాని బాబు, రాజేంద్రపురం ఉపాధ్యక్షుడు కొర్ర గోపాలరావు, కార్యదర్శి జర్తా పోతురాజు, బౌడ ఉపాధ్యక్షుడు గడుతూరి రాంబాబు, కార్యదదర్శి కొర్ర సన్యాసిరావు, కొమ్మంగి ఉపాధ్యక్షుడు తాంబెలి దేవయ్య, కార్యదర్శి వనుము వేమన్నపడాల్, పెదబరడ ఉపాధ్యక్షుడు కటుకూరి ధారబాబు, కార్యదర్శి దొంగబంటి వెంకటగిరి బాబు, చిన్నగెడ్డ ఉపాధ్యక్షుడు కొర్ర మోహన్ రావు, కార్యదర్శి వంతల బాలక్రిష్ణ, ఎ. శనివారం ఉపాధ్యక్షుడు లకే చిన్న రామస్వామి, కార్యదర్శి పి. రామేశ్ నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎంపీడీవో తెలిపారు. ఈఎన్నికల్లో సర్పంచులు దురియా పుష్పలత, లలిత, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వీరబాబు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సాగిన కృష్ణపడాల్, జిల్లా కార్యదర్శి లకే వెంకట రమణ, మండలాధ్యక్షుడు రామచంద్రరావు, పీవో, ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.

పెసా కమిటీలది కీలకపాత్ర

గిరిజనుల హక్కులు, చట్టాల పరిరక్షణలో పెసా కమిటీ పాత్ర కీలకమని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సాగిన కృష్ణ పడాల్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పెసా ఎన్నికలను గిరిజనులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. పేసా ఉపాధ్యక్షుడు, కార్యదర్శిలుగా సమర్థవంతమైన నాయకులను ఎన్నుకోవాలన్నారు. గ్రామంలో ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమలు, ప్రాజెక్టులు ఏర్పాటు చేయాల్సి వస్తే కచ్చితంగా గ్రామసభ తీర్మానం ఉండాలన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

▸▸ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి

చింతపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయభారతి అన్నారు. సోమవారం కళాశాలలో విద్యార్థులకు వర్షాకాలం పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వర్షాకాలం గాలిలో తేమశాతం అధికంగా ఉంటుందన్నారు. ఈకారణంగా క్రిములు, బ్యాక్టీరియా, వైరసలు వేగంగా వృద్ధి చెందుతాయన్నారు. ఇళ్ల పరిసరాలు, వసతి గృహాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురికి నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కో-ఆర్డినేటర్ మాట్లాడుతూ వర్షాకాలం వ్యాప్తి చెందే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధులు సోకిన వెంటనే ఆస్పత్రికి వెళ్లి మెరుగైన చికిత్స చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవో ఈశ్వర్, సతీశ్, పూర్ణరావు పాల్గొన్నారు.

హెల్త్ వెల్‌నెస్ సెంటర్స్‌కు బెడ్స్

▸▸ వ్యక్తిగత నిధులతో సమకూర్చిన తాజంగి వైద్యులు



వైద్యులు సమకూర్చిన బెడ్‌పై రోగికి చికిత్స అందిస్తున్న వైద్యసిబ్బంది

చింతపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):మండలంలోని తాజంగి పీహెచ్‌సీ పరిధిలోనున్న రెండు హెల్త్ వెల్‌నెస్ సెంటర్లకు వైద్యులు వ్యక్తిగత నిధులతో బెడ్స్ సమకూర్చారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో రోగులకు ప్రాథమిక వైద్యం అందించేందుకు ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, హెల్త్ అసిస్టెంట్, ఆశా కార్యకర్తలతోపాటు మందులు అందుబాటులో ఉంటాయి. వీటిలో సెలైన్, ఐరన్ సుక్రోజ్‌లు పెట్టేందుకు రోగులను నేలపై పడుకోబెట్టాల్సి వస్తున్నది. దీంతో తాజంగి పీహెచ్‌సీ వైద్యాధికారులు కె. సంతోశ్ కుమార్, జి. భవాని వ్యక్తిగత నిధులతో తాజంగి-2, కొత్తపాలెం-2 హెల్త్ వెల్‌నెస్ సెంటర్లకు ఒక్కొక్క బెడ్ చొప్పున సమకూర్చారు. ప్రస్తుతం ఈ బెడ్‌పై ఇద్దరు రోగులకు వైద్య సిబ్బంది చికిత్స అందిస్తున్నారు. దీన్ని ఆదర్శంగా తీసుకుని ఎంపీపీ మరో మూడు హెల్త్ వెల్‌నెస్ సెంటర్లకు మూడు బెడ్స్ అందజేస్తానని వైద్యాధికారులకు తెలియజేశారు. కాగా దాతలు ముందుకొస్తే గ్రామ స్థాయిలోనున్న ప్రతి హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో రోగులకు చికిత్స అందించేందుకు బెడ్స్ సమకూర్చవచ్చునని వైద్యాధికారులు సంతోష్ కుమార్, భవాని తెలిపారు.

సమాజ సేవలో జర్నలిస్టుల పాత్ర కీలకం

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ఎంపీ తనూజరాణి

ఘనంగా పాడేరు ప్రెస్‌క్లబ్ సర్వసభ్య సమావేశం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకులోయ ఎంపీ డాక్టర్ జి.తనూజరాణి అన్నారు. ముంచంగిపుట్టులో సోమవారం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిర్వహించిన పాడేరు ప్రెస్‌క్లబ్ సర్వసభ్య సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరైన ప్రసంగించారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను సైతం ఎదుర్కొంటూనే ఒక సామాజిక బాధ్యతతో జర్నలిస్టులు పనిచేస్తున్నారని కొనియాడారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి సీహెచ్‌బీఎల్.స్వామి మాట్లాడుతూ జర్నలిస్టులు సామాజిక స్పృహ కలిగి ఉండడంతో పాటు సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం ఏపీయూడబ్ల్యూజే సభ్యులు ఎంపీ, జడ్పీ చైర్‌పర్సన్‌లకు సత్కరించారు. అలాగే పాడేరు ప్రెస్‌క్లబ్ ప్రింట్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులుగా ఒ.జ్ఞానప్రకాశ్, ఎస్.సురేశ్‌కుమార్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.కొండలరావు, కె.జోషి, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు బి.నాగరాజు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.కిశోర్‌కుమార్, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్, పాత్రికేయులు కె.ప్రభుదాస్, పి.సత్యనారాయణ, హుకుంపేట, పాడేరు, జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల సభ్యులు పాల్గొన్నారు.

చర్చిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు

అరకులోయ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పద్మాపురం పంచాయతీ పరిధిలో యండపల్లివ ఆమెన్ చర్చి, పాస్టర్‌పై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని అల్లూరి జిల్లా యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు ఎం.బాబూరావు డిమాండ్ చేశారు. జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్, ఇతర క్రైస్తవ సంఘాల ప్రతినిధులతో సోమవారం యండపల్లివలస చర్చిలో ఫెలోసిప్ కార్యదర్శి బి.సంజీవ్‌కుమార్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాస్టర్ యోసుపాదం అతని ఇంటిపై దాడి జరగడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. సంఘటన జరిగిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికి దాడులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు పోలీసులు రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్థల వివాదం ఉన్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులు స్పందించి తగిన న్యాయం చేయాలని తెలిపారు. సంఘటన జరిగిన అనంతరం విజయనగరం రీజియన్ ఆర్టీసీ చైర్మన్, టీడీపీ అసంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర స్పందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇండియా ప్రజాబంధు పార్టీ అధ్యక్షుడు జోషఫ్ కింటుకూరి, రాష్ట్రీయ క్రైస్తవ పరిషత్ జిల్లా అధ్యక్షుడు సమరెడ్డి సింహాద్రి, పాడేరు యునైటెడ్ పాస్టర్స్‌ఫెలోషిప్ మండల అధ్యక్షుడు సాల్మన్‌రాజు, అరకులోయ క్రైస్తవ ఐక్యవేదిక పూర్వ అధ్యక్షుడు బురిడి ఆనందరావు, క్రైస్తవ ఐక్యవేదిక గౌరవ అధ్యక్షుడు బురిడి ఆనందరావు, ప్రతినిధులు రవి, రూబెన్, వోలేసి బాబురావు, ఆమెన్ చర్చి సంఘ సభ్యులు, పాస్టర్లు పాల్గొన్నారు.

మన్యంలో ముసురు

▸▸ పలు మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు



పాడేరులో వర్షానికి గొడుగులు వేసుకున్న దృశ్యం

పాడేరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో సోమవారం మన్యంలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా ముసురు వాతావరణం నెలకొనగా, సోమవారం తెల్లవారుజాము నుంచి వర్షం కురిసింది. ముఖ్యంగా ఒడిశాను ఆనుకుని ఉన్న పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో భారీ వర్షాలు కురవగా, ఇతర ప్రాంతాల్లో ఒక మోస్తరుగా వర్షాలు పడ్డాయి. అయితే జిల్లా కేంద్రం పాడేరులో జల్లులతో కూడిన వర్షం కురవడంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. ప్రస్తుతం మెట్ట ప్రాంతాల్లో ఖరీఫ్ వ్యవసాయ పనులు జరుగుతుండడంతో తాజా వర్షాలు అనుకూలిస్తాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అరకులోయలో...

అరకులోయ: మండల పరిధిలో సోమవారం ముసురు వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అడపాదడపా మోస్తరు వర్షం కురుస్తూనే ఉంది.

45 రేషన్ డిపోలకు ఈ-పోస్ పరికరాల పంపిణీ



డీలర్‌కు ఈ-పోస్ పరికరాలను అందిస్తున్న జేసీ అభిషేక్‌గౌడ

పాడేరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 45 రేషన్ డిపోలకు జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ ఈ- పోస్ పరికరాలను సోమవారం తన క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. పాడేరు మండలంలో ఉన్న 45 రేషన్ డిపోల్లో 65 ఏళ్లు నిండిన లబ్ధిదారులకు పైలట్ ప్రాజెక్టుగా ముందుగా వారికి ఇంటింటికీ రేషన్ పంపిణీ చేయాలని డీలర్లను జేసీ ఆదేశించారు. అందుకు గాను ఆయా ఈ-పోస్ యంత్రాలను వినియోగించి పారదర్శకంగా రేషన్ పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, పౌరసరఫరాల శాఖ డీఎం వి.మోహనరావు, డిప్యూటీ తహశీల్దార్ ఓ.ప్రశాంత్, ఈ-పోస్ టెక్నీషియన్ సోమేశ్వరరావు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా ప్రసాదరావు బాధ్యతలు



పీఏసీఎస్ చైర్మన్ ప్రసాదరావును సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

పెదబయలు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా నరంజి ప్రసాదరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నరంజి ప్రసాదరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు మంచి పాలన అందిస్తోందన్నారు. రైతులకు అన్ని విధాలుగా రుణాలను మంజూరు చేసి, వారి ఆర్థిక అభివృద్ధికి పాటుపడతానన్నారు. జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, పార్టీ అరకు ఇన్‌చార్జి, ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొరకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే డైరెక్టర్లుగా కొర్రా లక్ష్మణ్‌రావు, కోడా కోటేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వీ.కొండయ్య, దారెల సర్పంచ్ పాండురంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మెచ్చేలా పాలన

కేంద్ర సహకారం, సీఎం చంద్రబాబు అనుభవంతో

రాష్ట్రం అన్నింటా అభివృద్ధి: ఎంపీ సీఎం రమేశ్



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ రమేశ్, చిత్రంలో ఎమ్మెల్యే పంచకర్ల

సబ్బవరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలు నచ్చేలా, మెచ్చేలా పాలన సాగిస్తుందని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. మండలంలోని మొగలిపురంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సహ కారం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అను భవంతో రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకుపోతుం దన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన పథకాలకు మించి తమ ప్రభుత్వం పథకాలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. సూపర్ సిక్స్‌లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు, ఉచిత గ్యాస్, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి సం క్షేమ పథకాలు విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. అంతకంటే ముఖ్యంగా శాంతిభద్రతలు పక్కాగా అమలు జరుగుతున్నట్టు స్పష్టం చేశారు. సర్పంచ్ గండి అరుణ, ఎంపీటీసీ తమరాన సన్యాసమ్మ, పీఏసీఎస్ చైర్మన్ గండి దేముడు, కూటమి నాయకులు గండి వంశీదీప్, గొర్లి రామునాయుడు, గండి ముత్యాలనాయుడు, కర్రి కనకరాజు, ఇందలి రమణ, మిడతాడ మహాలక్ష్మీనాయుడు పాల్గొన్నారు.

వినాయక చవితికి ముహూర్తపు రాట



సీలేరులో ముహూర్తం రాట వేస్తున్న భక్తులు

సీలేరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేజర్ పంచాయతీలో దుర్గావీధి కమ్యూనిటీ హాల్ వద్ద వినాయక చవితి ముహూర్తపు రాటను నిర్వాహకులు ప్రతిష్ఠించారు. సోమవారం సీలేరులో 12 చోట్ల వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నారు. దుర్గావీధి కమ్యూనిటీ హాల్‌లో వినాయక వేడుకలను పురస్కరించుకుని మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా మార్కెట్‌లో వినాయక విగ్రహాలకు మంచి డిమాండ్ పెరిగింది.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

అనంతగిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో అనేక దుష్ప్రచారాలు చేస్తున్నారని, అసత్య ఆరోపణలు వెంటనే మానుకోవాలని టీడీపీ నాయకుడు, కొత్తూరు ఉప సర్పంచ్ గాలి నరసింహమూర్తి పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ టీడీపీ మండల అధ్యక్ష పదవి బరిలో ఉండడంతోనే తనపై కొంత మంది ఆరోపణలు చేస్తున్నారన్నారు. సామాజిక మాధ్యమల్లో తప్పుడు పోస్టులు పెట్టడం సమంజసం కాదన్నారు. తప్పు చేసినట్టు రుజువు చేస్తే టీడీపీ సభ్యత్వానికి రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా బేస్‌లైన్ పరీక్ష

పెదబయలు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా బేస్‌లైన్ పరీక్ష నిర్వహిస్తున్నామని అబ్జర్వర్ జి.జాన్సన్ దేవరాజు తెలిపారు. గత ఏడాది ఫలితాలు నిరాశపరిచాయని వాపోయారు. ఈ ఏడాది ఆ పరిస్థితి రాకుండా గురుకులం పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

నేత్రదాన పక్షోత్సవ ర్యాలీ



డుంబ్రిగుడలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

డుంబ్రిగుడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అంబిక అధ్వర్యంలో సోమవారం నేత్రదాన పక్షోత్సవ ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం నుంచి మూడు రోడ్ల కూడలి వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా నేత్రాలపై తీసుకోవాల్సిన తగిన జాగ్రత్తలు, నేత్రదానం వల్ల కలిగే ఉపయోగాలపై నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయరూ..

పెదబయలు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోమంగి వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని మండల సాధన కమిటీ అధ్యక్షుడు సల్లంగి ఉమామహేశ్వరావు, సభ్యులు కొమ్మ బాలరాజు, కూడ రాధాకృష్ణ కోరారు. సోమవారం విలేకరులతో వారు మాట్లాడుతూ గోమంగిని అనుకుని 20 గ్రామాలు ఉన్నాయని, సింగిల్ ఫేస్ కారణంగా నిత్యం విద్యుత్ సమస్య తలెత్తుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలోని గర్భిణులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఈ విషయంలో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.

హౌసింగ్ కార్యాలయ భవనం.. నిరుపయోగం!



తుప్పల మధ్య హౌసింగ్ సహాయక ఇంజనీరు కార్యాలయం

మాడుగుల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మాణం చేపట్టిన గృహ నిర్మాణ శాఖ కార్యాలయ భవనాన్ని నిరుపయోగంగా వదిలేశారు. స్థానిక హైస్కూల్ కాలనీలో ఐదేళ్ల క్రితం వరకు గృహ నిర్మాణ శాఖ కార్యాలయం అద్దె భవనంలో నిర్వహించేవారు. ఈ స్థితిలో అప్పటి అధికారులు హైస్కూల్ కాలనీలో ప్రభుత్వ స్థలాన్ని సేకరించి గృహ నిర్మాణశాఖ సహాయక ఇంజనీరు కార్యాలయం భవన నిర్మాణం చేపట్టారు. అనంతరం కొన్ని నెలల పాటు ఆ శాఖ కార్యకలాపాలు ఇదే భవనంలో నిర్వహించారు. విధులు నిర్వహించేందుకు అనుకూలంగా ఉన్నా, ఆ భవనం సక్రమంగా లేదని విడిచిపెట్టి 100 మీటర్ల దూరంలో మరో అద్దె భవనాన్ని తీసుకున్నారు. అప్పటి నుంచి నిర్మించిన నూతన భవనం వదిలేయడంతో చుట్టూ తుప్పలు పెరిగి నిరుపయోగంగా మారింది. అంతేకాకుండా పరిసర ప్రాంతంలో నివాస గృహాలు ఉండడంతో పాటు ప్రధాన రహదారికి ఆనుకుని ఉండటంతో ప్రస్తుతం రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారే పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని ఈ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించండి: ఆర్డీవో



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో రమణ

నర్సీపట్నం అర్బన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించడానికి తగిన చర్యలు చేపట్టాలని ఆర్డీవో వీవీ.రమణ అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి వచ్చిన వినతులు ఆర్డీవో స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 21 వినతులు అందాయి. మాకవరపాలెం మండలం రామన్నపాలెం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు యాకా అప్పలనాయుడు వెంకటాపురం గ్రామంలో పనిచేస్తున్నారని, దీంతో ఉపాధ్యాయుడు సక్రమంగా విధులకు హాజరుకావడం లేదని, స్థానికులకు మాయమాటలు చెప్పి పాఠశాలను తెరవడం లేదని ఫిర్యాదు అందింది. అదే మండలంలోని రాచపల్లి గ్రామానికి చెందిన అడిగర్ల రమణ ఫిర్యాదు అందించి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ స్పందనలో వచ్చిన వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

పెరిగిన సీతాఫలాల ధర

- కావిడి వెయ్యి నుంచి రూ.1500 వరకు విక్రయం
- వినాయకచవితి కావడంతో గిరాకీ



సంతలో విక్రయానికి తెచ్చిన సీతాఫలాలు

మాడుగుల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మాడుగుల మండల కేంద్రంలో సోమవారం జరిగిన వారపు సంతకు గిరిజన ప్రాంతాల నుంచి తీసుకొని వచ్చిన సీతాఫలానికి గిరాకీ పెరిగింది. పాడేరు మండలంలోని వంట్ల మామిడి, కక్కి, కందులపాలెం, దేవాపురం, ,పులుసుమామిడి, సలుగు వంటి పలు గిరిజన గ్రామాల్లో పండే ఈ సీతాఫలాల దిగుబడి తగ్గుముఖం పట్టడంతో వారపు సంతకు తక్కువ పండ్లను తీసుకొని వచ్చారు. అయితే వినాయక చవితి పండుగకు అధికంగా ఉపయోగపడే ఈ సీతాఫలాలను కొనుగోలు చేసేందుకు అధిక శాతం వ్యాపారులు వచ్చారు. దీంతో సంత ప్రారంభం నుంచే కావిడి సీతాఫలాల ధర వెయ్యి నుంచి రూ.1500 వరకు పలికింది. దీంతో గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

ఉత్తమ ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని



వలంటీర్ వెంకటలక్ష్మిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

చోడవరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో ఎన్ఎస్ఎస్ ఉత్తమ వలంటీరుగా చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎస్.వెంకటలక్ష్మి ఎంపికైంది. ఏయూ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్ విభాగాలకు సంబంధించి వెంకటలక్ష్మిని ఉత్తమ వలంటీర్‌గా ఎంపిక చేసి అవార్డు ప్రకటించారు. ఈ మేరకు వలంటీర్ వెంకటలక్ష్మిని కళాశాల ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ యూనిట్ల పీవోలు రత్నభారతి, మాల్యాద్రి, బిచ్చమ్మ, సమన్వయకర్త నారాయణమూర్తి తదితరులు సోమవారం అభినందించారు.

ఎరువుల దుకాణాల్లో అధికారుల తనిఖీలు



ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు

బుచ్చెయ్యపేట ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో మండల పరిషత్, పోలీసు, వ్యవసాయ శాఖాధికారులు అధికారులు సోమవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఎంపీడీవో బానోజీరావు, ఎస్ఐ శ్రీనివాసరావు, వ్యవసాయధికారి భాస్కరరావు తదితరుల బృందం దుకాణాల్లో ఎరువుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. సీతయ్యపేటలో 600 కిలోల ఎరువుల నిల్వ ఉన్నట్టు గుర్తించారు. రికార్డులు, స్టాక్ సక్రమంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. వ్యవసాయధికారి భాస్కరరావు మాట్లాడుతూ ప్రస్తుతానికి రైతులకు యూరియా అవసరం లేదని, వారికి కావాల్సిన సమయానికి రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచుతామని తెలిపారు.

త్వరలో వాక రోడ్డు నిర్మాణ పనులు

- ఆర్డీవోలు వీవీ.రమణ, షేక్ అయిషా



వాక రోడ్డు రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డీవోలు

మాకవరపాలెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వాక రోడ్డు నిర్మాణ పనులను తర్వలో ప్రారంభిస్తామని నర్సీపట్నం ఆర్డీవో వీవీ.రమణ, అనకాపల్లి ఆర్డీవో షేక్ అయిషా తెలిపారు. మాకవరపాలెం మండలంలోని రామన్నపాలెం సెంటరు నుంచి ఎలమంచిలి నియోకవర్గం పెదపల్లి గ్రామం ఎన్‌హెచ్-16 రోడ్డు వరకు చేపడుతున్న పనులను ఇద్దరు ఆర్డీవోలు సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 737 సర్వే నంబరుకు ఆనుకుని ఉన్న ఫారెస్ట్ భూమిలో సుమారు 2.5 కిలోమీటర్లు పొడవునా రోడ్డు వేయాల్సి ఉందని, ఫారెస్ట్ పరిధిలో ఈ భూమి ఉందని చెప్పారు. మరో ఎనిమిది డుగుల వెడల్పున రోడ్డు వేయాలని, ఇందులో భాగంగానే కొంత భూమిని తీసుకొని రెవెన్యూ భూమి ఇచ్చేందుకు జిల్లా కలెక్టర్ ఫారెస్ట్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. రామన్నపాలెం సెంటరు నుంచి 737 సర్వే నంబరులో ఉన్న ఎరకన్నపాలెం గ్రామం ఐదు కిలోమీటర్లు వరకు 60 అడుగులు, మిగిలిన 2.5 కిలోమీటర్లు పొడవునా 16 అడుగులు వెడల్పున రోడ్డు వేస్తున్నట్టు తెలిపారు. ఈ పనులు వారం రోజుల్లో ప్రారంభిస్తామని వారు చెప్పారు.

పాతకృష్ణాదేవిపేట చెరువుకు గండి

- తాత్కాలికంగా పూడ్చుకున్నరైతులు



చెరువు గండి పూడ్చుకుంటున్న రైతు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని పాతకృష్ణాదేవిపేట మంగళి చెరువు గండి కొట్టింది. దీంతో చెరువులో నిల్వ ఉన్న వర్షం నీరు వృథాగా బయటకు పోతోంది. ఫలితంగా ప్రస్తుతం వరినాట్లు వేసిన, పొలాలు దమ్ముపడుతున్న రైతులు భయాందోళన చెందుతున్నారు. చెరువుకు గండి కొట్టిన ప్రాంతంలో సమీపంలోని రైతులు కొంత మంది తాత్కాలికంగా పూడ్చుకున్నారు. అయినప్పటికీ పెద్దగా ఫలితం లేకపోయింది. దీంతో చెరువులో నీరు లీకవుతోంది. వర్షాలు పెరిగి చెరువులోకి అధిక నీరు చేరితే భారీ గండి పడే ప్రమాదం ఉంది. దీంతో చెరువును అనుకుని ఉన్న పొలాలు నీటి ఉధృతతో నాశనం ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే నీరు లేకపోతే చెరువుపై ఆదారపడి ఉన్న సుమారు 200 ఎకరాల వరి పంటకు ఇబ్బందులు ఎదురవుతాయని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ చెరువులో గండిని పూడ్చాలని కోరుతున్నారు.

జీడిపిక్కల వ్యాపారులపై మార్కెటింగ్ అధికారుల దాడులు

నాతవరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జీడిపిక్కల వ్యాపారుల గోదాములపై మార్కెటింగ్ శాఖాధికారులు సోమవారం దాడులు చేశారు. విశాఖపట్నం మార్కెటింగ్ రీజనల్ డైరక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో నర్సీపట్నం, పాయకరావుపేట, ఎలమంచిలి మార్కెట్ కమిటీ సెక్రటిరీలు ఈ దాడుల్లో పాల్గొన్నారు. ముందుగా మణికంఠ ట్రేడర్స్‌కు సంబంధించిన గోదాముపై దాడి చేసి 120 బస్తాలను గుర్తించారు. రూ.13500 మార్కెటింగ్ ఫీజు వసూలు చేశారు. అలాగే మరో గోదాముపై పోలీసుల సాయంతో దాడి చేసి 90 క్వింటాళ్ల జీడిపిక్కల బస్తాలను గుర్తించి, రూ.9 వేల మార్కెటింగ్ ఫీజు వసూలు చేశారు. మరో గోదాముకు వెళ్లగా తాళాలు వేసి ఉండటంతో యాజమాని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కెటింగ్ రీజనల్ డైరక్టర్ సుధాకర్ మాట్లాడుతూ జీడిపిక్కల వ్యాపారం చేసేవారు తప్పనిసరిగా లైసెన్సు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే మార్కెట్ ఫీజు చెల్లించాలని ఆదేశించారు. మార్కెటింగ్ ఫీజు చెల్లించకుండా వ్యాపారం చేస్తే చర్యలు తప్పవని, దాడులు చేసి మార్కెట్ ఫీజు కట్టిస్తామని ఆయన స్పష్టం చేశారు.

డబ్బులు ఇస్తేనే పనులు చేస్తున్నారు..

- టీడీపీ సమావేశంలో కార్యకర్తల గగ్గోలు

మాకవరపాలెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో డబ్బులు ఇస్తేనే అధికారులు పనులు చేస్తున్నారని టీడీపీ మండల సమావేశంలో కార్యకర్తలు గగ్గోలు పెట్టారు. సోమవారం ప్రభాకర్ రాజు ఇంటి వద్ద టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మాకవరపాలెం ఉప సర్పంచ్ లాలం రాము మాట్లాడుతూ రెవెన్యూలో పని కావాలంటే డబ్బులు ఇస్తేనే చేస్తున్నారని, కొందరికి ఎటువంటి పత్రాలు లేకుండానే వీఆర్‌వోలు పనులు చేస్తున్నారని చెప్పారు. టీడీపీ నాయకులు ఫిర్యాదు ఇస్తే వైసీపీ నాయకులకు వత్తాసు పలుకుతున్నారని ఆయన తెలిపారు. అలాగే గ్రామకంఠం భూమికి సంబంధించి ఆమోదానికి దరఖాస్తు చేసి ఐదు నెలలవుతున్నా ఇవ్వలేదని చెప్పారు. చినరాచపల్లి గ్రామానికి తాగునీరు లేదని ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని కార్యకర్తలు వాపోయారు. మాకవరపాలెం మండలంలో ఇంకా వైసీపీ ప్రభుత్వమే అధికారంలో ఉన్నట్టు ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు, ఏఎంసీ డైరెక్టరు యర్రంశెట్టి రమణ, పార్టీ నాయకులు అల్లు రామునాయుడు, జోగిపాత్రుడు, ఓబ్బలరెడ్డి గోవింద, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌కు కొత్త కంప్యూటర్లు

మాకవరపాలెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్‌కు రూ.6 లక్షల విలువైన కంప్యూటర్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిని సోమవారం అమర్చగా, ఎస్ఐ దామోదర్‌నాయుడు ప్రారంభించారు. పోలీసు స్టేషన్‌కు ఇంత మొత్తంలో కంప్యూటర్ సామగ్రిని మంజూరు కావడం ఇదే మొదటిసారని ఈ సందర్భంగా ఎస్ఐ తెలిపారు. ఇకపై స్టేషన్‌లో కంప్యూటర్ సంబంధిత పనులు వేగవంతంగా జరుగుతాయని చెప్పారు. కాగా, ఆధునాతన సామగ్రిని ప్రభుత్వం మంజూరు చేయడం ఎంతో శుభపరిణామమని సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు.



కంప్యూటర్లను పరిశీలిస్తున్న ఎస్ఐ దామోదర్‌నాయుడు

వీఓఏల సంఘం నూతన కార్యవర్గం

- అధ్యక్షురాలిగా రూపాదేవి, కార్యదర్శిగా వెంకటలక్ష్మి



వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు రూపాదేవి, కార్యదర్శి వెంకటలక్ష్మి, కోశాధికారి రాజేశ్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామ సహాయకుల సంఘం (వీఓఏ) జిల్లా నూతన కమిటీ ఎన్నిక సోమవారం ఇక్కడ సీఐటీయూ కార్యాలయంలో చేపట్టారు. గౌరవ అధ్యక్షునిగా వీవీ శ్రీనివాసరావు, అధ్యక్షురాలిగా సీహెచ్. రూపాదేవి, కార్యదర్శిగా ఎం. వెంకటలక్ష్మి, కోశాధికారిగా సీహెచ్ఎల్ఎన్ రాజేశ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా కె.కనకలక్ష్మి (కోటవురట్ల), ఎం.రాజ్యలక్ష్మి (నర్సీపట్నం), జి.సత్యవతి (రావికమతం), అప్పలనాయుడు (చీడికాడ), భవాని (కశింకోట), ఉష (మునగపాక), కె.సూరిబాబు (దేవరాపల్లి), లావణ్య (అచ్యుతాపురం), క్రాంతి (నాతవరం), రాము (అనకాపల్లి) ఎన్నికయ్యారు. మరో 25 మందిని జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: ఎంపీపీ



బస్టాండ్ ఆవరణలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ

మాడుగుల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిపైనా ఉందని ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం పేర్కొన్నారు. మాడుగుల బస్టాండ్ ఆవరణలో సోమవారం మట్టి విగ్రహాలను ఉచిత పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడడానికి భారత నిర్మాణ సేవా ట్రస్టు సభ్యులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రతీ ఏడాది మాదిరిగానే మట్టి విగ్రహాలను ప్రజలకు ఉచితంగా అందించడం ప్రశంసనీయమన్నారు. పర్యావరణాన్ని కాపాడే ప్రయత్నంలో భాగంగా 12 ఏళ్లుగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నామని భారత నిర్మాణ సేవా సంఘం సభ్యులు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కిముడు రమణమ్మ, సర్పంచ్ యడ్ల కళావతి, నాయకులు దంగేటి సూర్యారావు, శ్రీనాధ శ్రీనివాసరావు, పుప్పాల రమేశ్, వడ్డే రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెల్లలపాలెం రోడ్డు నిర్మించాలని నిరసన



డోలీ మోతలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

చీడికాడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోనాం శివారు రెల్లలపాలెం గిరిజన గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పించాలని ఆదివాసీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డోలీ మోతలతో వినూత్న నిరసన తెలిపారు. అనంతరం గిరిజన సంఘం జిల్లా నేత నరసింహమూర్తి మాట్లాడుతూ తమ గ్రామం నుంచి దేవరాపల్లి మండలం వాలాబు మీదుగా కోనాంకు రోడ్డు సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ రోడ్డు లేకపోవడంతో గిరిజనులు పండించిన ఉత్పత్తులను కోనాం సంతకు తీసుకువెళ్లడంతో పాటు, అక్కడికి నుంచి నిత్యావసర సరకులు తెచ్చుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే అత్యవసర వైద్య సేవల కోసం గర్భిణులు నరకం చూడాల్సి వస్తున్నదని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రెల్లలపాలెం గ్రామానికి రోడ్డు నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఇద్దరు ఎంపిక



రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన ఇద్దరు బాక్సర్లతో కోచ్

నర్సీపట్నం అర్బన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు నర్సీపట్నానికి చెందిన ఇద్దరు మహిళా బాక్సర్లు ఎంపికయ్యారు. తిరుపతిలో ఈ నెల 26వ తేదీన జరగునున్న పోటీల్లో యర్రా తేజశ్విని, బొంతు మౌనిక పాల్గొంటారని కోచ్ అబ్బు తెలిపారు. విశాఖ జోనల్ స్థాయిలో జరిగిన పోటీల్లో యర్రా తేజశ్విని 81 కిలోలు, బొంతు మౌనిక 75 కిలోల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారని కోచ్ చెప్పారు.

జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఇద్దరు విద్యార్థులు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలుర సాఫ్ట్‌బాల్ పోటీలకు ఏఎల్ పురం, చీడిగుమ్మల పాఠశాలలకు చెందిన లగుడు చైతన్య నరసింహనాయుడు, బి.లోకేశ్ ఎంపికయ్యారు. వీరిని గొలుగొండ ఎంఈవో-2 కృష్ణప్రసాద్, హెచ్ఎం ఆనందరావు, కృష్ణాదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వరరావు, సాఫ్ట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణ, సూర్యనారాయణ, ఉపాధ్యాయులు వీరిని అభినందించారు.

ఆరు, ఏడు తేదీల్లో చోడవరంలో సీఐటీయూ జిల్లా మహాసభలు

- ఉపాధ్యక్షుడు పరమేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న పరమేశ్వరరావు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ జిల్లా మహాసభలను సెప్టెంబరు ఆరు, ఏడు తేదీల్లో చోడవరంలో నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధ్యక్షుడు పీఎస్‌వీ పరమేశ్వరరావు తెలిపారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లా డుతూ, అసంఘటిత కార్మికులకు రక్షణ కల్పించాలని, ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. భారీ వాహనాలను పగటిపూట అనకాపల్లి పట్టణంలోకి అనుమతించకపోవడం వల్ల ముఠా కార్మికుల ఉపాధిపై ప్రభావం పడిందని అన్నారు. ఈ సందర్భంగా మండల సమన్వయ కమిటీని నియమించారు. కన్వీనర్‌గా కాళ్ల తేలయ్యబాబు, సభ్యులుగా పీఎస్‌వీ పరమేశ్వరరావు, గంటా శ్రీరామ్, మందా రాము, పి. సురేశ్, బోడి రాజు, వై.ఏసురాజు, బొమ్మాల రాము, ఎన్.వరలక్ష్మి, ఎం.సూర్యకళ, ఎం.సూర్యలక్ష్మి, ఎం.అప్పలరాజు, బి.అప్పారావు, ఎంపీ నాయుడు, కె.నాయుడు, కె.నాగేశ్వరరావు, వారాది సత్యనారాయణ, కొండారావు ఎన్నికయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చోడవరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసయ్యపేట, టీచర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ డీఈ అప్పారావు తెలిపారు. చోడవరం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ లైన్ల నిర్వహణ పనుల దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ సరఫరా ఉండదని చెప్పారు. ఈ అంతరాయాన్ని వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని డీఈ కోరారు.

రోలుగుంటలో...

రోలుగుంట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ డీఈ అప్పారావు ఓ ప్రకటనలో తెలిపారు. రోలుగుంట ఫీడర్‌లో మరమ్మతు పనుల కారణంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రోలుగుట, కొమరవోలు, కొంతలం, కె.నాయుడుపాలెం, కొవ్వూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీహెచ్‌సీలో రక్తదాన శిబిరం

కె.కోటపాడు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీలక్ష్మి ప్రారంభించారు. సుమారు పది మంది యువకులు రక్తదానం చేశారు. వీరిని వైద్యులు అభినందించారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానంలో పాల్గొనాలని ఈ సందర్భంగా డాక్టర్ శ్రీలక్ష్మి కోరారు. కార్యక్రమంలో వైద్యులు కోటేశ్వరరావు, ఆర్.రమ, జి.వైదేహి, సునీల్, మహేశ్, రోజారాణి, కుసుమరాణి, ప్రశాంత్, సురేంద్రబాబు, బ్లడ్ స్టోరేజ్ యూనిట్ టెక్నీషియన్లు నాగేశ్వరరావు, రవి, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా వెంకటరమణ



వెంకటరమణ

నాతవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడిగా నందిపల్లి వెంకటరమణ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. స్థానిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా వెంకటరమణ చెప్పారు.

ఇనాం భూ సమస్య పరిష్కరించండి

రోలుగుంట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జేపీ అగ్రహారం గ్రామంలో ఇనాం భూ సమస్యను పరిష్కరించాలని రైతులు డిమాండ్ చేశారు. గ్రామంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాజీ సర్పంచ్ రొంగలి రమణ మాట్లాడుతూ ఈ సమస్యపై అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన లేదని వాపోయారు. మండలానికి వస్తున్న ప్రతీ తహశీల్దార్ హామీలు ఇవ్వడం తప్ప న్యాయం చేయడం లేదన్నారు. రీ సర్వేలోనైనా సరే న్యాయం చేసి సాగుదారులందరికీ పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయాలని కోరారు.

పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలల వేతనాల పంపిణీ

రావికమతం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మేజరు పంచాయతీ కొత్తకోటలో పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలల వేతనాన్ని ఎంపీడీవో సీతారామస్వామి సోమవారం అందజేశారు. ఈ ఏడాది మార్చి నుంచి జూన్ వరకు 26 మంది కార్మికులకు నాలుగు నెలలకు సంబంధించి రూ.85 వేలు పంచాయతీ ఖాతా నుంచి డ్రా చేయించి కార్మికుల ఇళ్లకే వెళ్లి వేతనాలు అందించినట్టు ఎంపీడీవో తెలిపారు. అనంతరం టి.అర్జాపురం రైతు సేవా కేంద్రంలో ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. అలాగే పి.పొన్నవోలు డ్వాక్రా మహిళలకు వెలుగు ద్వారా కొనుగోలు చేసి అందించిన పాడి గేదెలను పరిశీలించారు. పాడి పరిశ్రమ ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడాలన్న ఆయన సూచించారు.

డిప్యూటీ ఎంపీడీవోకు సత్కారం

చీడికాడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎంపీడీవో సిహెచ్.చంద్రశేఖర్‌ను సోమవారం సత్కరించారు. స్వాతంత్ర్య దినోత్సవంలో ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్న సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వి.హేమసుంద్రరావు, ఎంఏవో కె.శ్రీనివాస్, ఎంఈవో కె.బొంజుబాబు చంద్రశేఖర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్తంభాలు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

చీడికాడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖండివరం గ్రామంలో కంచె కోసం వేసిన స్తంభాలను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన వేచలపు కామేశ్ తహశీల్దార్, పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. తన జిరాయితీ భూమిలో వేసిన ఈ నెల 20న వీఆర్వో, వీఆర్‌వో, సర్వేయర్ సమక్షంలో కంచె వేసుకున్నానని, దాన్ని ఇద్దరు వ్యక్తులు ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వారి చర్యలు తీసుకోవాలని కోరారు.

మాడుగులలో చిరు జల్లులు

మాడుగుల రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం చిరుజల్లులు కురిశాయి. మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎండ కాయగా, అనంతరం వాతావరణం మారిపోయి ఆకాశం మబ్బులు కమ్ముకుని జల్లులు పడ్డాయి. వ్యవసాయానికి ఇవి అనుకూలంగా ఉంటాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

మాడుగుల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాలకు సంబంధించి నిర్వాహకులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ జి.నారాయణరావు హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వినాయక ఉత్సవాలకు సంబంధించి ఇప్పటికే 40 దరఖాస్తుల అందాయన్నారు. అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన విగ్రహాలను మొదటి రోజే అనుపు చేయాల్సి ఉందన్నారు. ఈ విషయాన్ని ప్రతీ ఒక్కరూ గమనించాలని ఎస్ఐ కోరారు.

మండపాలకు అనుమతులు తప్పనిసరి

కృష్ణాదేవిపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి మండపాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ వై.తారకేశ్వరరావు చెప్పారు. అలాగే నిర్వాహకులు నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ఎటువంటి గొడవలు జరగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు వెదురుపర్తి విద్యార్థినులు


రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో హెచ్‌ఎం, పీడీ

కశింకోట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో ప్రకాశం జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు వెదురుపర్తి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారని హెచ్‌ఎం కేఆర్‌ఎస్‌ఎన్ నాయుడు తెలిపారు. ఈ నెల 24న లంకెలపాలెంలో జరిగిన జిల్లాస్థాయి టెన్నికాయిట్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించగా, వెదురుపర్తి పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని ఎస్.శ్రీజత జూనియర్ విభాగంలో, 9వ తరగతి విద్యార్థిని కె.హాసిని సబ్ జూనియర్ విభాగంలో ప్రతిభ కనబరిచినట్టు చెప్పారు. వీరికి తర్ఫీదు ఇచ్చిన పీడీ ఎ.నూకరాజును ఆయన అభినందించారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సురేంద్ర

అనకాపల్లి టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర సోమవారం తిరుమలలో వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. సోమవారం జన్మదినాన్ని పురస్కరించుకుని స్నేహితులు, సన్నిహితులతో కలిసి తిరుపతి వెళ్లారు.


తిరుమలలో శ్రీవారిని దర్శించుకుని బయటకు వచ్చిన సురేంద్ర, మిత్రులు

జాతీయస్థాయి యోగా పోటీలకు గురుకుల విద్యార్థినులు

పరవాడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో వచ్చే నెలలో నిర్వహించనున్న జాతీయ స్థాయి యోగా పోటీలకు మండలంలోని తానాం ప్రభుత్వ గురుకుల పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో కె.హారిక (ఇంటర్ ద్వితీయ సంవత్సరం), జి. నిఖిత (పదో తరగతి), పి.లక్ష్మీసాహిత్య (పదో తరగతి), పి.రామసాహిత్య (పదో తరగతి), బి.సంధ్య (పదో తరగతి) బంగారు పతకాలు సాధించారు. దీంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు యోగా శిక్షకుడు సీహెచ్.ఆంజనేయులు తెలిపారు.


జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

పీజీఆర్‌ఎస్ అర్జీలను త్వరగా క్లియర్ చేయాలి

» అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో అందే అర్జీలను క్లియర్ చేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జేసీ జాహ్నవి, డీఆర్‌ఓ సత్యనారాయణరావుతో కలిసి నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమంలో ప్రలజు అందజేసిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. ఒకే సమస్యకు సంబంధించి ప్రజలు పలుమార్లు అర్జీలు అందజేయాల్సిన అవసరం లేకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. నిబంధనలకు లోబడి పరిష్కరించలేని వాటి గురించి సంబంధిత అర్జీదారులకు తెలియజేయాలన్నారు. పీజీఆర్‌ఎస్‌లో వివిధ సమస్యలకు సంబంధించి 344 అర్జీలు అందాయని కలెక్టరేట్ విభాగం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీలు సుబ్బలక్ష్మి, రమామణి, అనిత, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

జిల్లా పోలీసు కార్యాలయంలో...

అనకాపల్లి రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ తుహిన్‌సిన్హా పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారితో స్వయంగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్‌లో అందిన అర్జీపై ఏడు రోజుల్లో విచారణ పూర్తిచేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు వంటి అంశాలకు సంబంధించి మొత్తం 46 అర్జీలు అందినట్టు జిల్లా పోలీస్ కార్యాలయం అధికారులు వెల్లడించారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

» కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులను అన్ని విధాలా ప్రోత్సహిస్తూ జిల్లాలో ఉత్తమ క్రీడాకారులను తయారు చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆమె అధ్యక్షతన జరిగిన జిల్లా క్రీడా అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతూ, ప్రతిభ ఉన్న క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం లభిస్తే అద్భుతంగా రాణిస్తారన్నారు. యువత చదువుతో


మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. నర్సీపట్నం, అనకాపల్లిలో భూమిని సేకరించి ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో మోడల్లో స్విమ్మింగ్‌పూల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలని ఆయా అధికారులను ఆదేశించారు. జిల్లాలో 15 మండల కేంద్రాల్లో ఇప్పటికే 20 సెంట్ల చొప్పున భూమిని సేకరించామని, వీటిని సమగ్రంగా పరిశీలించి వాలీబాల్ కోర్టుల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలని జడ్పీ సీఈఓను ఆదేశించారు. సమావేశంలో జేసీ ఎం.జాహ్నవి, డీఆర్‌వో వై. సత్యనారాయణరావు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎల్.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో భారీ గణనాథుడు

... 5వ పేజీ తరువాయి

పేర్కొన్నారు. విగ్రహం తయారీకి సుమారు రూ.70 లక్షలు ఖర్చు చేస్తున్నట్టు ఉత్సవ కమిటీ కన్వీనర్ బుద్ధ భూలోకనాయుడు చెప్పారు. స్వామివారిని రోజూ ఉదయం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు భక్తులు ఉచిత దర్శించుకోవచ్చని మిగిలిన సమయాల్లో హోమాలు, అభిషేకాలు నిర్వహిస్తామని, వీటిలో పాల్గొనేందుకు టికెట్ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. సెప్టెంబరు 22వ తేదీన భారీ ఎత్తున అన్నసమారాధన, 23న నిమజ్జన కార్యక్రమం ఉంటుందన్నారు.


ముఖద్వారంలో ఏర్పాటు చేసిన సెట్టింగ్

ఎన్టీఆర్ స్టేడియంలో భారీ వినాయక విగ్రహం

» ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ సీఎం రమేశ్


బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎంపీ సీఎం రమేశ్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో సంపత్ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న 126 అడుగుల భారీ లక్ష్మీగణపతి విగ్రహ ఏర్పాట్లను అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, అనకాపల్లి పట్టణంలో భారీ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందిస్తున్న దాడి రత్నాకర్, కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్, కమిటీ ప్రతినిధులు బుద్ధ భూలోకనాయుడు, శిల్పి కామధేను ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. కాగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడారి ఆనంద్‌కుమార్ కూడా ఈ విగ్రహ ఏర్పాట్లను పరిశీలించారు.



ప్రమాదంలో వారధులు

... 5వ పేజీ తరువాయి

పట్టింది. చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలో వున్న ఈ వంతెనలు కూలిపోవడం వల్ల ఈ రెండు నియోజకవర్గాల ప్రజలే కాకుండా మొత్తం ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వడ్డాది, విజయరామరాజుపేట వంతెనల స్థానంలో కొత్తవంతెన నిర్మాణానికి ఇంతవరకు నిధులు మంజూరు కాలేదు. తాజాగా కూలిన కట్టువాని అగ్రహారం వంతెన గురించి ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు.


పిల్లర్ల వద్ద ఇసుక తవ్వకాలతో గౌరీపట్నం వంతెనకు పొంచి ఉన్న ముప్పు

ప్రమాదం అంచున మరికొన్ని వంతెనలు

బీఎన్ రోడ్డులో చోడవరం మండలం గోవాడ వద్ద శారదా నదిపై వంతెన శిథిలావస్థకు చేరింది. 1960వ సంవత్సరంలో నిర్మించిన ఈ వంతెన సామర్థ్యం 40 టన్నులు కాగా.. 80 నుంచి 100 టన్నుల బరువగల గ్రానైట్ రాళ్లను రవాణా చేసే వాహనాలు వెళుతున్నాయి. మరోవైపు వంతెన కింద, పిల్లర్లకు సమీపంలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. దీంతో వంతెనకు ముప్పు పొంచివుంది. పొరపాటున ఈ వంతెన కూలిపోతే.. విశాఖపట్నం, అనకాపల్లి వైపు నుంచి చోడవరం, మాడుగుల, పాడేరు ప్రాంతాలకు వాహనాల రాకపోకలు స్తంభించిపోతాయి.

వడ్డాది-విజయరామరాజుపేట మధ్య బొడ్డేరు నదిపై వున్న వంతెన కూలిపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించాల్సిన వాహనాలను చోడవరం మండలం గౌరీపట్నం మీదుగా మళ్లించారు. ఈ మార్గంలో వాహనాల రద్దీ పెరగడంతో గౌరీపట్నం వంతెనకు ముప్పు వాటిల్లుతున్నది. 1994లో నిర్మించిన ఈ వంతెన ఇసుక అక్రమ తవ్వకాలతో పిల్లర్లు బలహీనంగా మారాయి. మరో ప్రత్యామ్నాయ వారధి అయిన చోడవరం సమీపంలో పెద్దేరు నదిపై ఉన్న జన్నవరం వంతెన కూడా నేడో రేపో అన్నట్టుగా ఉంది. ఇది కూలిపోతే చోడవరం నుంచి రావికమతం, బుచ్చెయ్యపేట, రోలుగుంట మండలాలకు రవాణా వ్యవస్థ స్తంభిస్తుంది. మాడుగుల ఘాట్ రోడ్ జంక్షన్- మాడుగుల మధ్య తాచేరు నదిపై వున్న వంతెన కూడా ఎప్పుడు కూలిపోతుందో తెలియని స్థితిలో వుంది.

ప్రతిపాదనలకే పరిమితం

ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు జిల్లాలో బలహీనంగా వున్న వంతెనలను ఇటీవల పరిశీలించారు. గోవాడ, విజయరామరాజుపేట, వడ్డాది, గౌరీపట్నం వద్ద కొత్త వంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. వడ్డాది, విజయరామరాజుపేట వద్ద కూలిన వంతెనలతోపాటు గోవాడ వద్ద ప్రస్తుతం వున్న వంతెన స్థానంలో కొత్త వంతెనల నిర్మాణానికి గత వైసీపీ ప్రభుత్వంలో కూడా అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి పంపారు. నిధులు మాత్రం మంజూరు కాలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్‌అండ్‌బీ అధికారులు ఒకసారి ప్రతిపాదనలు పంపారు. ఆయా ప్రాంతాల్లో కొత్త వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించే బాధ్యత ప్రజాప్రతినిధులపైనే వుందని రెండు నియోజకవర్గాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, VASIREDDI VENKAMDORA (Old Name) S/o. Vasireddy Krishna Murthi, R/o. 3-17/1, Patha Bazar Veedhi, Rowthulapudi, East Godavari. Change my name from VASIREDDI VENKAMDORA (Old Name) to VASIREDDY VENKANNA DORA (New Name). Hence forth I am being called as VASIREDDY VENKANNA DORA (New Name) For all purposes.
AJV_241922

CHANGE OF NAME

★ We, SARILLA KISHORE KUMAR & SARILLA SUSEELA parents of RONY JOEL (Old Name), R/o. 5-43, Sivakodu, Gummallagaruvu, Razole, DR.B.R.AMBEDKAR KONASEEMA. Change my son's name from RONY JOEL (Old Name) to SARILLA RONY JOEL (New Name). Henceforth he will be called as SARILLA RONY JOEL (New Name) for all purposes
AJV_241924

CHANGE OF NAME

★ I, SWARANGI SRI SAI DURGA VISISTA VARSHITHA (Old Name) D/o. Swarangi Rama Krishna, R/o. 24-8-3A, Plot No.369, Vinayaka Nagar, Gajuwaka, Visakhapatnam. Change my name from SWARANGI SRI SAI DURGA VISISTA VARSHITHA (Old Name) to SWARANGI VISISTA VARSHE (New Name). Henceforth I am being called as SWARANGI VISISTA VARSHE (New Name) for all purposes
AJV_241923

For Advertisement Contact :
9963231176
9966165093

CHANGE OF NAME

★ I, UPADRASTA VENKATA RAMANA MURTY (Old Name) S/o. Upadrasta Satyanarayana Bhukta, R/o. DL-87, Sriram Panorama Hills, Opp. Club House, Yendada, VSKP. Changing my name from UPADRASTA VENKATA RAMANA MURTY (Old Name) to UPADRASTA VENKATA RAMANA MURTHY (New Name). Henceforth I am being called as UPADRASTA VENKATA RAMANA MURTHY (New Name) for all purposes
AJV_241925

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్

... 5వ పేజీ తరువాయి

అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయ శాఖల అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల కిందట చోడవరంలోని శ్రీలక్ష్మీదేవి ఎరువుల దుకాణంలో ఒక కంపెనీకి చెందిన తక్కువ ధర ఎరువులను, అదే కంపెనీకి చెందిన ఎక్కువ ధర గల ఎరువుల సంచుల్లోకి మార్చి రైతులను మోసగిస్తున్నట్టు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. తాజాగా కె.కోటపాడు మండలం కె.సంతపాలెంలోని గాయత్రి ఎరువుల దుకాణంలో వ్యవసాయాధికారులు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేశారు. ఇక్కడ లక్షలాది రూపాయల విలువచేసే నిషేధిత, నకిలీ ఎరువులను గుర్తించారు. ఎన్‌పీకే 17-17-17 రకం ఎరువు 200 బస్తాలు, ఎన్‌పీకే 19-19-19 రకం ఎరువు 220 బస్తాలు, ఎంఓపీ ఎరువు 60 బస్తాలు, 20-20-20 రకం ఎరువు 60 బస్తాలు, భూశక్తి ఎరువు 60 బస్తాలు మొత్తం 620 బస్తాలను సీజ్‌చేశారు. వీటి విలువ రూ.8.42 లక్షలు వుంటుందని, ఈ ఎరువులను దుకాణదారుడు హైదరాబాద్‌లోని వెంకటేశ్వర ఆగ్రోస్ అండ్ ఫెర్టిలైజర్స్ కంపెనీ నుంచి కొనుగోలు చేసి, ఇక్కడకు రప్పించినట్టు అధికారుల విచారణలో తేలింది. ఎరువుల దుకాణం నిర్వాహకుల్లో కింతాడ హరీశ్‌పై కేసు నమోదు చేశారు. సీజ్ చేసిన ఎరువుల బస్తాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ టి.అప్పలనాయుడు, ఎస్‌ఐ రవికుమార్, వ్యవసాయ అధికారి ఎంవీ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు. కాగా కలెక్టర్ ఆదేశాల మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కలిసి జిల్లాలో ఎరువుల దుకాణాలపై తనిఖీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి తెలిపారు. నకిలీ ఎరువులు విక్రయిస్తున్నట్టు రుజువైతే లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు.

ఎరువుల వ్యాపారుల దోపిడీ

... 5వ పేజీ తరువాయి

తీసుకెళ్లలేదని, వారికి ఏదో విధంగా నచ్చజెబుతామని, అయితే బస్తాకు రూ.350 ఇవ్వాలని వ్యాపారులు షరతు విధిస్తున్నారు. వరినాట్లు వేసే సమయంలో ఎరువులు తప్పనిసరి కావడంతో వ్యాపారి అడిగినంత డబ్బులు సమర్పించుకుని, రైతులు ఎరువులు కొనుగోలు చేసి తీసుకెళ్లాల్సి వస్తున్నది. బయట ఎవరైనా అడిగితే.. బస్తా యూరియా రూ.270కి కొనుగోలు చేసినట్టు చెప్పాలని కండిషన్ పెడుతున్నారు. కాగా ఎక్కువ ధరకు ఎరువులు అమ్ముతున్న విషయాన్ని మండల వ్యవసాయ అధికారి అనసూయ దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకెళ్లగా.. ప్రభుత్వం ప్రకటించిన ధరలకే ఎరువులు విక్రయించాలని వ్యాపారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని, ఎవరైనా అధిక ధరకు ఎరువులు విక్రయిస్తున్నట్టు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ఏయూ రిజిస్ట్రార్ రాజీనామా!

... 5వ పేజీ తరువాయి

తెలిసింది. అలాగే శతాబ్ది ఉత్సవాలకు గవర్నర్‌ను ఆహ్వానించేందుకు కూడా వీసీ ఒక్కరే వెళ్లిపోయారు. ఈ తరహా ఆహ్వానాలను అందించేప్పుడు సాధారణంగా వీసీ వెంట రిజిస్ట్రార్ ఉంటారు. వీటితోపాటు అనేక కీలక నిర్ణయాల్లోనూ ఇద్దరి మధ్య దూరం పెరిగిందని, అదే తాజా నిర్ణయానికి కారణంగా పేర్కొంటున్నారు. కాగా రాజీనామాపై రిజిస్ట్రార్‌తో మాట్లాడేందుకు యత్నించగా ఆయన అందుబాటులో లేరు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ మృతి

నక్కపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిచెర్ల కొత్తూరు-ఒడ్డిమెట్ట గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ మృతిచెందాడు. ఎస్‌ఐ సన్నిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం తుని వైపు నుంచి నక్కపల్లి వైపు వస్తున్న కూరగాయల లోడు లారీ గొడిచెర్ల కొత్తూరు వద్దకు చేరుకున్నప్పుడు టైరు పంక్చర్ అయ్యింది. డ్రైవర్, క్లీనర్ కిందకు దిగి, టైర్ పంక్చర్ వేస్తుండగా, ఈ సమయంలో వెనుక నుంచి వస్తున్న సిమెంట్ ట్యాంకర్ లారీ, ఆగి వున్న కూరగాయల లోడు లారీని ఢీకొన్నది. దీంతో ట్యాంకర్ లారీ క్లీనర్ ప్రదీప్ ప్రమాణిక్ అక్కడికక్కడే మృతిచెందాడు. కూరగాయల లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

పది మద్యం సీసాలు స్వాధీనం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం తుమ్మపాలలో ఒక వ్యక్తి నుంచి పది మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ ఎస్‌ఐ సంతోశ్‌కుమార్ తెలిపారు. మార్టూరు గ్రామానికి చెందిన ఇసాస్వరపు సూర్యనారాయణ తుమ్మపాలలోని దుకాణంలో మద్యం కొనుగోలు తీసుకెళుతున్నాడు. దారిలో పోలీసులు ఆపి తనిఖీ చేయగా పది మద్యం సీసాలు లభ్యం అయ్యాయి. వీటిని స్వాధీనం చేసుకుని సూర్యనారాయణపై కేసు నమోదు చేశారు.

గంజాయి కేసులో ముద్దాయికి జైలు శిక్ష

చోడవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పది కిలోల గంజాయి తరలిస్తూ పట్టుబడిన ముద్దాయికి నాలుగేళ్ల మూడు నెలల జైలు శిక్ష ఖరారు చేస్తూ సోమవారం స్థానిక 9వ అదనపు జిల్లా జడ్జి హరినారాయణ తీర్పు ఇచ్చారు. 2021 మే నెల 21న మండలంలోని వెంకన్నపాలెం వద్ద ముగ్గురు వ్యక్తులు పది కిలోల గంజాయితో పట్టుబడ్డారు. ఈ కేసులో కేరళకు చెందిన సమ్మర్ అనే వ్యక్తి సోమవారం కోర్టు ఎదుట విచారణ సందర్భంగా తన నేరం అంగీకరించడంతో అతనికి నాలుగేళ్ల మూడు నెలల జైలు శిక్ష ఖరారు చేశారు. అయితే ముద్దాయి పట్టుబడిన నాటినుంచీ జైలులోనే ఉన్నందున, నేరం అంగీకరించడంతో అతను జైలులో ఉన్న కాలాన్నే శిక్షగా ఖరారు చేస్తూ జడ్జి తీర్పు వెల్లడించారు. ఈ కేసులో అరెస్టు అయిన మరో ఇద్దరు నిందితులు కోర్టు విచారణలకు హాజరుకాకపోవడంతో వారిపై కేసు కొనసాగుతుందని జడ్జి తన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

విద్యార్థిని పట్ల లెక్చరర్ అసభ్య ప్రవర్తన

» పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘటన

» పోక్సో చట్టం కింద కేసు నమోదు

పరవాడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిని పట్ల లెక్చరర్ అసభ్యంగా ప్రవర్తించిన ఘటన పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు శనివారం ఫంక్షన్‌కు వెళ్లేందుకు కెమిస్ట్రీ లెక్చరర్ గుత్తల శ్రీధర్‌ను పర్మిషన్ అడిగారు. ఆయన కుదరదని చెప్పడంతో ముగ్గురూ క్లాసులకు వెళ్లిపోయారు. కొంతసేపటి తరువాత ముగ్గురిలో ఒకరిని శ్రీధర్ ల్యాబ్‌కు పిలిపించుకొని అసభ్యంగా ప్రవర్తించారు. ఆమె భయంతో బయటకు పరుగులు తీసింది. ఈ విషయాన్ని ఇంటి వద్ద తల్లికి చెప్పింది. తల్లి, సోదరుడి సహాయంతో ఆదివారం పరవాడ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు లెక్చరర్ శ్రీధర్‌ను ఆదివారం రాత్రి అరెస్టు చేశారు. బాధితురాలు మైనర్ కావడంతో నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ సోమవారం తెలిపారు. లెక్చరర్ శ్రీధర్ రెండేళ్ల క్రితం పరవాడ కళాశాలకు బదిలీపై వచ్చారు. ఆయన తీరు మొదటి నుంచి సరిగా ఉండేది కాదని, విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించేవారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే విద్యార్థినులు ధైర్యం చేసి ప్రిన్సిపాల్‌కు చెప్పలేకపోయారు. ఈ సంఘటన జరిగిన తరువాత లెక్చరర్ చేష్టల గురించి ప్రస్తుత ప్రిన్సిపాల్‌కు పూసగుచ్చినట్టు వివరించినట్టు సమాచారం.


లెక్చరర్ శ్రీధర్ (ఫైల్ ఫొటో)

బనారస్ ఎక్స్‌ప్రెస్ తాత్కాలిక రద్దు

విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ రైల్వే జోన్ పరిధిలో నాన్ ఇంటర్ లాకింగ్ పనులు చేపడుతున్న నేపథ్యంలో విశాఖ-బనారస్ మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 27 నుంచి కొద్దిరోజులు తాత్కాలికంగా రద్దు చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27, 31, సెప్టెంబరు 9, 10 తేదీల్లో విశాఖ-బనారస్ ఎక్స్‌ప్రెస్ (18523), తిరుగు ప్రయాణంలో బనారస్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18524) ఈ నెల 28, సెప్టెంబరు 1, 8, 11 తేదీల్లో రద్దు చేసినట్టు పేర్కొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తాం

» పార్టీశ్రేణుల మనోగతం తెలుసుకుంటాం

» జనసేనాని సభపై అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ


మునిసిపల్ స్టేడియంలో జనసేన సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో జనసైనికులు, వీరమహిళల అభిప్రాయాలు తెలుసుకొని ప్రజలకు మరింత చేరువయ్యేలా పార్టీ పటిష్ఠతకు కృషి చేస్తామని అనకాపల్లి శాసనసభ్యుడు, పార్టీ సమన్వయ కమిటీ చైర్మన్ కొణతాల రామకృష్ణ చెప్పారు. ఈ నెల 30న జనసేన పార్టీ నిర్వహించనున్న క్రియాశీల కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేసేందుకు చేపడుతున్న వివిధ ఏర్పాట్లపై ఇందిరా మున్సిపల్ స్టేడియం ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని అనుమతులు తీసుకొని భూమిపూజ చేసి సభ ఏర్పాట్లు ప్రారంభించామని, వర్షం వచ్చినా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జర్మన్ టెక్నాలజీతో స్టేజ్ పరదాలను (షెడ్‌లను) నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. బహిరంగ సభకు రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు విదేశాల నుంచి సైతం 14,650 మంది హాజరవుతారన్నారు. లోపలకు ప్రవేశానికి ఏర్పాటు చేస్తున్న మూడు గేట్లలో వీర మహిళలకు ఒకటి, వీవీపీలకు ఒక గేటు, మిగిలిన వారికి ఇంకో గేటు ద్వారా మధ్యాహ్నం ఒంటి గంటకు సభ ప్రారంభమవుతుందని కొణతాల చెప్పారు. సాయంత్రం ఆరు గంటలకు అధినేత పవన్ కల్యాణ్ ప్రసంగం ఉంటుందని తెలిపారు. వచ్చేవారికి భోజన ఏర్పాట్లు సైతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. సభలో కార్యకర్తల అభిప్రాయాలు, సూచనలు తెలుసుకోవటమే కాకుండా, పార్టీ విధివిధానాలు సైతం ప్రజల్లోకి తీసుకెళతామన్నారు. కూటమి పార్టీలతో కలసి ఎలా పనిచేయాలి? ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృత స్థాయిలో ఎలా తీసుకు వెళ్లాలో దిశానిర్దేశం చేయనున్నట్లు పేర్కొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	108.00
లైవ్ ధర	128.00
విత్ స్కిన్	226.00
స్కిన్ లెస్	236.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539